ఆదివారం

ప్రజాశక్తి

మే 23, 2004

చరిత్ర సృష్టించిన

సోనియా

హ్యాపీ బర్త్‌డే

(23-5-2004 నుండి 29-5-2004 వరకు)

షేక్ కరిష్మా
మే 23
షేక్ రషీదున్నీసా - షేక్ ఖాసీ
తలాటికుంట్ల గ్రామం, ఖమ్మం జిల్లా

బుగత ప్రవీణ్
4సం॥, 23.5.2000
అప్పలకొండ - అప్పలనాయుడు
రాజాం, శ్రీకాకుళం జిల్లా

మానేపల్లి రత్నకుమారి
3సం॥, 23.5.2001
సుబ్బలక్ష్మి - ప్రభాకరరావు
మద్దిలపాలెం, విశాఖపట్నం

దేవరపల్లి అఖిలేష్ ఆనంద్
7సం॥, 24.5.1997
విజయకుమారి - రాములు
అనంతవరం, ప్రకాశం జిల్లా

యలమల పల్లవి
5సం॥, 24.5.1999
దేవి, లోవరాజు
చోడవరం, విశాఖపట్నం

షేక్ తబసుమ్ (సానియా)
మే 24
యూసఫ్ హుస్సేన్ - జబిన్
గూడూరు, నెల్లూరు జిల్లా

ఎం.క్రాంతి కిరణ్
7సం॥, 28.5.1997
భవాని - శంకరయ్య
కల్వకుర్తి, మహబూబ్‌నగర్ జిల్లా

సాయిరాం
2సం॥, 28.5.2002
పుష్ప - సత్యనారాయణ
ఇంద్రపాలనగరం - నల్గొండ

సాయి అభినామ్
1సం॥, 28.5.2003
లావణ్య - మహేష్
నిర్మల్, ఆదిలాబాద్ జిల్లా

ఎ.ధరణి కుమార్
4సం॥, మే 2000
సుజన - శ్రీనివాస్
కొండాయపాలెం, నెల్లూరు జిల్లా

దీప్తి మోనిక
7సం॥, మే 1997
రాజేశ్వరి - యలమందయ్య
ఖమ్మం టౌన్, ఎన్.ఎస్.పి. క్యాంప్,
ఖమ్మం జిల్లా

ప్రకాశం
3సం॥, మే 2001
పిచ్చమ్మ - వెంకన్న
ముత్తగూడెం, ఖమ్మం జిల్లా

జోసఫ్
4సం॥, మే 2000
పిచ్చమ్మ - వెంకన్న
ముత్తగూడెం, ఖమ్మం జిల్లా

పి.నిఖిల్
7సం॥, మే 1997
కవిత - చంద్రశేఖర్
మహబూబాబాద్,
వరంగల్ జిల్లా

ఎస్.రాజేంద్ర ప్రసాద్
2సం॥, మే 2002
రాణి - రమేష్
బెల్లంకొండ, గుంటూరు జిల్లా

సూర్య
4సం॥, మే 2000
సుజాత - నాగ సురేష్
గుంటూరు

పింకి
4సం॥, మే 2000
మర్రెడ్డి రమాదేవి - శ్రీనివాసరెడ్డి
అద్దంకి, ప్రకాశం జిల్లా

మహ్మద్ కైఫ్
2సం॥, మే 2002
షమీమ్ - రియాజ్
మదనపల్లి, చిత్తూరు జిల్లా

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి,
ఆదివారం అనుబంధం



యువతను భ్రష్టు పట్టిస్తున్న 'పాప్'

మే 9 ఆదివారం అనుబంధంలో ప్రచురించిన కవర్ స్టోరీ చాలా బాగా ఆకట్టుకుంది. పాప్, ర్యాప్ సంగీతం గురించి చక్కగా వివరించారు. ఆ సంగీతంలో మునిగిపోయి యువత వారి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. ముఖ్యంగా ఎమ్.టీవీ, ఎమ్.జి.ఎమ్., ఐటీవీలు పాప్ సంగీతాన్ని ప్రసారం చేసి యువతను భ్రష్టుపట్టిస్తున్నాయి. అలాగే హిందీలో తెలుగులోనూ వచ్చే ప్రైవేట్ ఆల్బమ్స్ యువతను రెచ్చగొట్టే విధంగా వుంటున్నాయి. ప్రైవేట్ ఆల్బమ్స్ మీద సెన్సారింగ్ ఉండాలి.

– మానస, మచిలీపట్నం

రియల్‌స్టోరీ అద్భుతం



మే 9 2004 ఆదివారం అనుబంధంలో ప్రచురించిన విజయవాడ ఫొటోగ్రాఫర్ తమ్మా శ్రీనివాసరెడ్డి రియల్ స్టోరీ కథనం స్టోరీ చదివి అద్భుతం. ఎంతో అనిర్వచనీయమైన ఆనందానికి, అనుభూతికి లోనయ్యాం. ఇక తప్పిపోయిన పాపని గుర్తించిన వారి తల్లిదండ్రుల ఆనందం మాటలలోనూ, రాతలలోను చెప్పలేనిది, అది నిజంగా అపూర్వం. ఇంత అద్భుతమైన కథని ప్రచురించిన ప్రజాశక్తికి హృదయ పూర్వక ధన్యవాదాలు.

– టి. దుర్గాప్రసాద్,
అరండల్‌పేట, గుంటూరు.



కళాసాహితి తీర్చిదిద్దుతున్నారు

9 మే 2004 ఆదివారం ప్రజాశక్తి అనుబంధంలో కళాసాహితి శీర్షిన ప్రచురించిన సమాజ చైతన్యమే సమద్రాల లక్ష్యం. కళాభిమానంలో కళానైపుణ్యాన్ని ఒక కళాకారుడుగా కళను కళాత్మకంగా తీర్చిదిద్దడం నిజంగా అద్భుతం. సత్యనారాయణగారిని వారి నాటక కళకు జీవం పోసిన అభినవ నాటక బ్రహ్మ అని చెప్పడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదనిపిస్తోంది. కళాసాహితీ శీర్షికను బాగా తీర్చిదిద్దుతున్నందుకు అభినందనలు.

– మేడూరి సత్యనారాయణ,
తిరువూరు, కృష్ణాజిల్లా

గరిమెళ్ళ గారికి ఘనమైన దణ్ణం

మే 9వ తేదీన ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో వచ్చిన గరిమెళ్ళ గారి కవితలోని కథనం, నేటి మానవ మనుగడలోని మర్మాన్ని, ఎంత హేయంగా, దీనంగా, దారుణంగా ధీరంగా చెప్పారు సూర్యగారు. అంతరాంతరాలలోని ఆవేదనను అక్షరరూపంలో ఆవిష్కరించినది మన గరిమెళ్ళగానం.

– పాటిబండ్ల స్వరాజ్యలక్ష్మి,
తాడేపల్లి, గుంటూరు జిల్లా

ఎయిర్‌పోర్ట్ కథ బాగుంది

పట్నాల్లో నివసించే డబ్బున్న వారికోసం నిర్మించే విమానాశ్రయం కోసం తమ భూములు, ఇళ్ళు కోల్పోయి గ్రామీణులు అనుభవించే నరకం వివరిస్తూ రాసిన ఎయిర్‌పోర్ట్ కథ ఆకట్టుకుంది. ఈ కథలో రాసిన సంఘటనలు దేశంలోనూ, రాష్ట్రంలోనూ అనేక చోట్ల జరుగుతూనే ఉన్నాయి. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కట్టినపుడు కూడా ఇదేవిధంగా జరిగింది. నాగరీక ప్రపంచం కోసం వారు చేసే త్యాగాలు మరుగున పడిపోతున్నాయి. అమాయక గ్రామీణ ప్రజలు అనుభవించే వేదనలకు ఎయిర్‌పోర్ట్ కథ అద్దం పట్టింది.

– పి. సుబ్బారావు, విశాఖపట్టణం; ప్రతిభ, హైదరాబాద్

మనతో మాట

విలన్ మట్టికరిచాడు....

సినిమా క్లైమాక్స్‌లో ఉంది..

హీరో బృందం, విలన్ బృందంపై భీకరంగా పోట్లాడుతోంది.

కత్తులు, కర్రలు, శూలాలు, బాంబులతో ఆ ప్రదేశమంతా భీభత్సంగా ఉంది.

సినిమా రూల్ ప్రకారం...

విలన్ బృందం యావత్తు ఓడిపోతుంది..

అందరూ పలాయనం చిత్తగిస్తారు...

మెయిన్ విలన్ మాత్రం తీవ్రంగా గాయపడి కదల్లేక, మెదల్లేక మూలుగుతుంటాడు...

హీరో బృందం విలన్ పీచమణిచిన సంతోషంతో వెనుదిరిగిపోతుంటారు....

అదిగో అప్పుడే కిందపడి మూలుగుతున్న విలన్ అతికష్టంమీద లేస్తాడు..

పక్కనే పడి ఉన్న శూలం ఒకటి చేతిలోకి తీసుకుంటాడు..

వెనుకగా వచ్చి హీరోను వెన్నుపోటు పొడుస్తాడు....

సినిమా రూల్ ప్రకారం తీవ్రంగా గాయపడిన హీరోను అర్జెంట్‌గా కార్పొరేట్ ఆస్పత్రికి తరలించి బ్రతికించి శుభం కార్డ్ వేస్తారు..

కొన్ని సినిమాల్లో అయితే విలన్‌ను వ్యతిరేకించే అతని తరపు వ్యక్తో లేక హీరో తల్లి, చెల్లి లాంటి పాత్రలు బల్లె హీరోను బ్రతికించుకుంటారు...

తెలుగు సినిమా పుట్టినప్పటినుండీ ఇప్పటి వరకు నడుస్తున్న సినిమా ఇదే...

కాకపోతే భారత ఎన్నికల కురుక్షేత్రం సినిమా ముగింపే భిన్నంగా ఉంది....

ఈ సినిమాలో కథానాయికను సంహరించడానికి విలన్ బృందం కొత్త ఎత్తుగడ పన్నింది...

ప్రత్యక్ష యుద్ధంలో నెగ్గలేక కుతంత్రాలకు దిగింది...

అయితే సినిమాలో మాదిరిగా ఇక్కడ కథానాయిక బృందానికి ఎటువంటి నష్టం, కష్టం కలగలేదు...

విలన్ బృందం ఆశలు నెరవేరలేదు...

విలన్ మాత్రం మట్టికరిచాడు..

కథానాయిక బృందం నాయకత్వాన్ని మార్చుకుని ముందుకు సాగిపోయింది...

రూల్ ప్రకారం విలన్లకు ఓటమి తప్పదు కదా?

ఈ సంచికలో . . .

ఔరా!	. . . 3
కార్టూన్ కదంబం...	. . . 4
కవర్ స్టోరీ	. . . 5
జీవనశైలి	. . . 10
బాలల కథ	. . . 11
బాలనేస్తాలు	. . . 12
ఇంతిసంగతులు	. . . 16
కచేరి	. . . 17
ఆరోగ్యం	. . . 18
పుస్తక పరిచయం	. . . 20
న్యాయసలహాలు	. . . 24

ఇంకా...

సమస్య కథ... 8, 9

పద ప్రదర్శకురాలు

రియల్‌స్టోరీ... 14, 15

బౌద్ధం వెల్లివిరిసిన చోటిది.....

టూరిస్ట్ గైడ్ . . . 21



మానవీయ సంబంధాలను ప్రమోట్ చేస్తున్న నాటకరంగం

కళాసాహితి . . . 22, 23

ఔరా!

ప్రయివేటీకరణ జాడ్యానికి నిరసన

ప్రభుత్వాల ప్రయివేటీకరణ జాడ్యానికి ప్రపంచవ్యాప్తంగా ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. పూర్వపు సోవియట్ యూనియన్‌లో అక్టోబర్ విప్లవం వచ్చిన తర్వాత జార్ చక్రవర్తుల రాజభవనాలన్నింటినీ జాతీయం చేసి పరిరక్షించారు. వాటన్నింటినీ వారసత్వపు సంపదగా ప్రకటించి అనేక భవనాలను మ్యూజియంలుగా మార్చారు. ప్రజలు ఉచితంగా సందర్శించడానికి అనుమతించారు. 1990వ దశకంలో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైన తర్వాత రష్యా ఆర్థిక పరిస్థితి దిగజారి ప్రస్తుతం ఆనాటి రాజభవనాలను ప్రయివేటు సంస్థలకు ఇవ్వడానికి చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. తాజాగా సెయింట్ పీటర్స్‌బర్గ్ నగరంలోని అనేక రాజభవనాలను, పురాతన భవనాలను రియల్ ఎస్టేట్ సంస్థలకు ఇవ్వడానికి స్థానిక ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పుడు ఆ భవనాలన్నీ ఆలనాపాలనా లేక బూజు పట్టిపోతున్నాయి. వందల సంవత్సరాల నాటి ఆ భవనాలను ప్రభుత్వమే పరిరక్షించాలని వ్యాపార సంస్థలకు ఇవ్వరాదని అలా చేస్తే వాటితో ప్రజలకు ఇక ఎటువంటి సంబంధం ఉండదని, వాటిని చూడటానికి కూడా అవకాశం ఉండదని ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు

ఆగకుండా 66 గంటల ఉపన్యాసం

పేరు సంపాదించడానికి అనేకమార్గాలు. ఎవరికి తోచిన రీతిలో వారు కృషి చేసి గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడానికి తాపత్రయపడుతుంటారు. ఎవరైనా ఏకధాటిగా నాలుగైదు గంటలు మాట్లాడితే నోరు నొప్పి పెడుతోందని వాపోతారు. మరి ఇక ఆ విధంగా మాట్లాడకూడదని నిర్ణయించుకుంటారు. కాని బహ్రెయిన్‌లోని ఒక సంస్థలో మేనేజ్‌మెంట్ శిక్షకుడుగా పనిచేస్తున్న జమీల్ అల్‌నసీర్ అనే వ్యక్తి ఏకంగా 66 గంటల పాటు ఏకధాటిగా మాట్లాడి వినేవారికి, చూసేవారికి నోట మాట రాకుండా చేశాడట! బుధవారం సాయంత్రం 7.30 గంటలకు మాట్లాడటం ప్రారంభించి శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకు నోరు మూసాడట. గతంలో జింబాబ్వే వాసి ఒకరు 62 గంటలు మాట్లాడి సృష్టించిన రికార్డును అల్‌నసీర్ బద్దలుగొట్టాడు. నసీర్ భాషకు సంబంధించి అరబిక్‌లో ప్రసంగం చేశాడట. ప్రతి ఎనిమిది గంటలకు ఒకసారి ఉపన్యాసం ఆపి భోజనం చేసి మరలా మొదలు పెట్టాడట. ఈ విధంగా గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో ఎక్కుదామని ఆయన ప్రయత్నం. ఆ పుస్తకంలో ఎక్కేందుకు అవసరమైన డాక్యుమెంట్స్, సాక్ష్యాలు పంపే ప్రయత్నంలో ప్రస్తుతం ఆయన తలమునకలుగా ఉన్నాడు.

విజయమాల్యా చర్మ సంరక్షణ

పారిశ్రామికవేత్తలకు వినియోగదారుడు లోకువన్నట్లుగా పరిస్థితి తయారైంది. మద్యం తయారు చేసి వందల కోట్లకు పడగలెత్తిన పారిశ్రామికవేత్త విజయమాల్యా తాజాగా చర్మ సంరక్షణ మందుల తయారీ రంగంలో అడుగు పెట్టాడట! ఆయన ఇప్పటికే అందాల పోటీల అవార్డులు ఇవ్వడంలో, ఈత దుస్తుల తయారీలో బిజీగా ఉంటూ రాజకీయాల్లో కూడా ప్రవేశించాడు. ఇంతకీ విషయం ఏమిటంటే భారతదేశంలో ప్రస్తుతం ఏటా రు.5 వేల కోట్ల చర్మ సంరక్షణ ఉత్పత్తులు వినియోగిస్తున్నారు. ఈ రంగంలో కూడా ప్రవేశించి కోట్లు సంపాదించాలని మాల్యా కంకణం కట్టుకున్నాడు. అందుకే తనదైనా సరళిలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయుల చర్మ సంరక్షణకు ఉపయోగపడే ఉత్పత్తులు తయారు చేయబోతున్నాడు. భారతీయుల చర్మం, రంగును దృష్టిలో ఉంచుకుని అందుకు తగిన విధంగా తమ ఉత్పత్తులు ఉంటాయని ఆయన చెబుతున్నాడు. ఇక్కడ గొప్పతనం ఏమిటంటే ఈ ఉత్పత్తులేవీ భారత్‌లో తయారు కావట! విదేశాల్లో తయారైన ఆ ఉత్పత్తులను స్వదేశీ ప్యాకింగ్స్‌లో పెట్టి అమ్ముతాడట?! స్వదేశీ సీసాలో విదేశీ మద్యం లాగా అన్నమాట!?

కార్టూన్ కదంబం


మీరేం అధైర్యపడకండి
వచ్చే ఎన్నికల కల్లా పార్టీని
పునర్నిర్మించుకుందాం!
టిడిపి
ఐదేళ్ల తర్వాత మనదే
అధికారం : బాబు


మీకు గుండు గీసే అవకాశం
కోల్పోయినందుకు బాధ పడు
తున్నాడట మేడం
సుష్మ
సోనియా ప్రధాని
అయితే గుండు
గీయించుకుంటా
- సుష్మ


ఇది పాత సీఎంది సార్!
ఉంచేదా, తీసేయాలా!!
ప్రపంచబ్యాంకు
వద్ద బోలెడబ్బు
ఉన్నది:
వైఎస్
సీఎం
నారు

పన్నెండేళ్ళ క్రితం భర్త రాజీవ్‌గాంధీ హత్యకు గురయ్యేంత వరకు ఆమె ఓ సామాన్య గృహిణి. ఆరేళ్ళ క్రితం వరకు భర్తను కోల్పోయి పిల్లలను చూసుకుంటూ కాలం వెళ్ళదీస్తున్న తల్లి. పాతాళానికి దిగజారిన కాంగ్రెస్‌కు ప్రాణప్రతిష్ట చేసి 13వ లోక్‌సభలో ప్రతిపక్షనాయకురాలిగా బాధ్యతలు నిర్వహించారు. 14వ లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బి.జె.పి. కూటమిని మట్టికరిపించడంతో కాంగ్రెస్ తరఫున ప్రధాని అభ్యర్థిగా ముందుకు వచ్చారు. ప్రధాని పదవికి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిత్రపక్షాల ఆమోదం పొందారు. అయినా చివరిక్షణంలో మతోన్మాదుల విషప్రచారంతో, అందివచ్చిన ప్రధాని పదవిని, దేశ లౌకిక వ్యవస్థ పరిరక్షణకోసం పరిత్యజించి చరిత్ర సృష్టించారు. తనకు అధికారం కన్నా దేశమే ముఖ్యమని నిర్ద్వంద్వంగా ప్రకటించారు. ఆమే సోనియాగాంధీ. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనూహ్య విజయాలు సాధించటంతో సోనియా గాంధీ ప్రపంచం దృష్టినాకర్షించారు. సోనియా పేరు వెనక ఉన్న గాంధీ అన్న పదం ఎంత శక్తివంతమైనదో దాదాపు 10 ఏళ్ల నుండి అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ పార్టీని, 15ఏళ్లకు పైగా అధికారం లేని గాంధీ-నెహ్రూ కుటుంబాన్ని అధికారానికి దగ్గర చేయటంలో సోనియాగాంధీ చూపించిన చాకచక్యం నిరూపిస్తోంది.

చరిత్ర సృష్టించిన సోనియా

కొండూరి వీరయ్య

1946 డిసెంబరు తొమ్మిదవ తేదీన ఇటలీలోని టురిన్ కౌంటీ (రాష్ట్రం)లోని అర్బెస్సెనో పట్టణంలో స్టెఫానో మైనో, పౌలా మైనోల జంటకు పుట్టిన సంతానమే సోనీ మైనో (రాజీవ్‌ను వివాహం చేసుకున్నాక సోనియాగా మారారు). సోనియా జన్మించే నాటికి వారిది సాధారణ చేతివృత్తులపై ఆధారపడిన కుటుంబం. బాల్యమంతా సాంప్రదాయక రోమన్ కాథలిక్ కుటుంబంలో గడిచింది. సోనియా తండ్రి భవన నిర్మాణం పనులు చేయించే చిన్నపాటి కాంట్రాక్టరు. సోనియాకు ప్రస్తుతం తల్లి, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. వారు స్వస్థలం అర్బెస్సెనోలో చిన్న షాపు పెట్టుకుని వ్యాపారం చేస్తున్నారు. పాఠశాల, కాలేజీ విద్యలు టురిన్‌లో పూర్తి చేసుకున్న సోనియా ఇంగ్లీషు భాషలో పట్టా పుచ్చుకునేందుకు 19ఏళ్ల వయసులో ఇంగ్లాండ్‌లోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో చేరారు. అదే సమయంలో రాజీవ్‌గాంధీ కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ చదువుతున్నారు. విశ్వవిద్యాలయం ఆవరణలోని గ్రీక్ రెస్టారెంట్‌లో తొలిసారి 1965లో సోనియాకు రాజీవ్‌గాంధీతో పరిచయమైంది. అప్పటికి ఇందిరా గాంధీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టలేదు. రాజీవ్‌గాంధీ నెహ్రూ మనవడిగానే గుర్తింపు పొందారు. బుద్ధిమంతుడు, తెలివైన విద్యార్థి అయిన రాజీవ్‌తో సోనియాకు ఏర్పడిన పరిచయం కాస్తా ప్రణయంగా మారింది. రెండేళ్ళ విశ్వవిద్యాలయ జీవితం తర్వాత రాజీవ్‌గాంధీ 1968లో సోనియాను పెళ్లాడారు. అప్పటి నుండి సోనియా భారతదేశంలోనే స్థిరపడిపోయారు. సోనియా గాంధీ కొత్త పాతలు లేకుండా అత్త ఇందిరా గాంధీతో బాగా కలిసిపోయి ఆమె మన్ననలు పొందింది. దీంతో రాజీవ్, సోనియాల స్వేచ్ఛా జీవితానికి ఇందిరాగాంధీ కూడా ఎప్పుడూ అడ్డు చెప్పలేదు. రాజీవ్‌గాంధీకి సుదీర్ఘ రాజకీయ వారసత్వం ఉన్నప్పటికీ, ఆయన తల్లి ప్రధానిగా, తమ్ముడు యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా ఉన్నప్పటికీ పైలట్‌గా ఉన్న రాజీవ్‌గాంధీ మాత్రం రాజకీయాలకు దూరంగా సోనియాతో కాలక్షేపం చేస్తూ వచ్చారు. 1968లో ఢిల్లీలో స్థిరపడినప్పటికీ భారతీయ సాంప్రదాయపు కట్టు, బొట్టు, ఆహారపు అలవాట్లకు అంతగా అలవాటుపడని సోనియా వ్యక్తిగత జీవితాన్ని తన అభిరుచులకు అనుగుణంగా కొనసాగిస్తూ వచ్చింది. 1970లో ఒకసారి మినీ స్కర్టు వేసుకుని రాజ్‌పథ్‌లో రాజీవ్‌తో కలిసి ఐస్‌క్రీంలు తింటుండగా ఒక ఫోటోగ్రాఫర్ ఫోటోలు తీసి ప్రచురించటంతో పెద్దఎత్తున వివాదానికి దారితీసింది. అప్పటి నుంచి భారతీయ సాంప్రదాయాలు అధ్యయనం చేయటంలోను, అలవాటు చేసుకుని ఆచరించటంలోను సోనియాగాంధీ శ్రద్ధాసక్తులు చూపుతూ వచ్చారు. మొదటి నుండీ రాజీవ్ గాంధీ రాజకీయాలకు దూరంగా ఉండేవాడని, సాధ్యమైనంత వరకు ఖాళీ సమయం తన భార్యా, పిల్లలతో విహారయాత్రల్లో గడిపేందుకు ప్రాధాన్యత ఇచ్చేవాడని ఆయన సన్నిహితులు అంటుంటారు.

చేదు అనుభవాలు

1980 వరకు సాఫీగా సాగిన రాజీవ్, సోనియాల సంసారం తర్వాత కాలంలో వరుసగా చేదు అనుభవాలు చవి చూడాల్సి వచ్చింది. 1980 జూన్ 23న సంజయ్‌గాంధీ విమాన దుర్ఘటనలో మరణించారు. అప్పటివరకు ఇందిరకు అటు రాజకీయాల్లోను, ఇటు వ్యక్తిగత విషయాల్లోను చేదోడువాదోడుగా ఉంటున్న సంజయ్‌గాంధీ అకాల మరణంతో ఇందిరాగాంధీ మానసికంగా దెబ్బతిన్నారు. దాంతో ఆమెకు సహాయం అందించి ఆమె బాధను పంచుకునే మరో వ్యక్తి సహకారం అవసరం అయ్యింది. దీంతో రాజీవ్‌గాంధీ ఇండియన్ ఎయిర్‌లైన్స్ పైలట్ ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లో ప్రవేశించారు. రాజీవ్ గాంధీ రాజకీయాల్లో ప్రవేశించటం పట్ల సోనియాకు అభ్యంతరాలు ఉన్నప్పటికీ అప్పుడున్న పరిస్థితుల్లో రాజీవ్ రాజకీయ ఆరంగేట్రానికి అడ్డు చెప్పలేకపోయింది. దీంతో తాను కుటుంబాన్ని చక్కదిద్దుకోవటానికి, పిల్లలు, వారి చదువులు చూసుకోవటానికి పరిమితమయ్యింది. ఈ పరిస్థితి ఇలా కొనసాగుతుండగానే 1984లో మరో ఉత్పాతం ఆ కుటుంబాన్ని తాకింది. 1984 అక్టోబరులో ఇందిరా గాంధీ తన నివాసంలోనే స్వంత అంగరక్షకుల చేతుల్లో హత్యకు గురయ్యారు. సఫ్దర్‌జంగ్1లో ప్రస్తుతం ఇందిరాగాంధీ స్మారక కేంద్రంగా ఉన్న ఇంట్లోనే అంగరక్షకుల తుపాకులకు బలయిన ఇందిరా గాంధీ సోనియా గాంధీ చేతుల్లో తన

తుది శ్వాస విడిచారు. దీంతో అప్పటి నుండి రాజీకీయాలంటే సోనియాకు ఏవగింపే కాక భయం కూడా తోడయ్యింది. దీంతో వంద సంవత్సరాల చరిత్ర ఉన్నప్పటికీ కుటుంబ ఆధిపత్యం నుండి బయటపడలేని కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం వహించాలని రాజీవ్‌గాంధీపై ఒత్తిడి తేవటం ఆయన దానికి అంగీకరించటం 1984 ఎన్నికల్లో ఇందిర హత్య కారణంగా పెల్లుబుకిన సానుభూతి పవనాలతో అఖండ మెజారిటీ సాధించి రాజీవ్‌గాంధీ ప్రధాని కావటం తెలిసిందే. అప్పటికే పాశ్యాత్య విద్య, వివిధ దేశాలు తిరిగిన అనుభవం, అమ్మ వెంట నడుస్తూ నేర్చుకున్న రాజకీయ పాఠాలతో రాజీవ్ గాంధీ తనదంటూ ఒక రాజకీయ దృక్పథం ఏర్పాటు చేసుకున్నారు. ఈ దృక్పథానికి అనుగుణంగా 1984లో రాజీవ్ గాంధీ ఇచ్చిన నినాదమే "21వ శతాబ్దంలోకి అభివృద్ధి చెందిన దేశంగా భారత్" అన్న నినాదం. ఈ కాలంలో పలు రంగాల్లో చోటు చేసుకున్న పరిణామాలు, రాజీవ్ చుట్టూ చేరిన భజన బృందం, క్రమంగా రాజీవ్‌ను ప్రజలకు దూరం చేసి కార్పొరేట్ ప్రపంచానికి దగ్గర చేశాయి. దీంతో ఆయన అనుసరించిన విధానాల దశ, దిశ మారి పోయింది. నాయకుడు ప్రజలకు ఒక్క అడుగు ముందుంటేనే నాయకత్వం వహించగలుగుతాడు, ప్రజలకు వెనకబడినా, వారిని దాటి మరీ ముందుకు పరిగెత్తినా వారికి నాయకత్వం వహించలేడు అన్న నానుడి రాజీవ్ గాంధీ విషయంలో రుజువయ్యింది. ఆయన ఆలోచనలు దేశం అందుకోలేనంత ముందుకు వెళ్లటంతో 1989లో జరిగిన ఎన్నికల్లో ఆయన ఓటమి పాలయ్యారు. దీనికి ముందు బోఫోర్సు తుపాకుల కుంభకోణం వెలుగు చూడటం, ఈ కారణంతో ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఉన్న వి.పి.సింగ్ రాజీనామా చేయటం, ప్రతిపక్షాలను కలుపుకుని దేశవ్యాప్త ఉద్యమం నిర్మించటం తెలిసిన చరిత్రే. ఈ సమయంలోనే సోనియాగాంధీ వ్యక్తిగతంగా రాజకీయవివాదాలకు కేంద్ర బిందువుగా మారారు. బోఫోర్స్ తుపాకుల కొనుగోలు ఒప్పందం కుదర్చిన హిందూజాలు, విన్‌ఛద్దాలకు బోఫోర్స్ కంపెనీకి మధ్యవర్తిగా వ్యవహరించిన ఆంటోనియా ఖత్రోచ్చి ఇటలీ దేశస్తుడు కావటంతో ఈ కుంభకోణం వెనుక సోనియా కుటుంబం ప్రయోజనాలు దాగి ఉన్నాయన్న విమర్శలు వచ్చాయి. అపుడు రగిలిన బోఫోర్సు చిచ్చు తాజా ఎన్నికల వరకు మండుతూనే ఉంది. ఈ నడుమ 1989లో ఏర్పడిన వి.పి.సింగ్ ప్రభుత్వం పతనం కావటంతో మధ్యంతర ఎన్నికల ప్రచారంలో ఉండగా రాజీవ్‌గాంధీని పెరంబదూరు సమీపంలో ఎల్‌టిటిఇ ఆత్మాహుతి దళాలు దారుణంగా



కుటుంబ సభ్యులతో ఇందిరాగాంధీ

హతమార్చాయి. ఆ దుర్ఘటనతో సోనియా గాంధీ మరింత ఒంటరి అయిపోయారు.

అధికారం కంటే పిల్లల భవిష్యత్తే ప్రధానం

రాజీవ్ హత్యతో తీవ్రంగా కలత చెందిన సోనియా గాంధీ ప్రజా జీవితానికి దూరమయ్యారు. తన జీవితంలో నూతన అధ్యాయం ప్రారంభించారు. రాజీవ్ గాంధీ లేని అధ్యాయం అది. రాజీవ్ ఆశయాలతో తాను మమేకం అయినప్పటికీ 1991లో కాంగ్రెస్ ప్రభుత్వానికి నాయకత్వం వహించేందుకు సోనియా గాంధీ తిరస్కరించటం పదవుల పట్ల ఆమెకు గల దృక్పథాన్ని రుజువు చేసింది. ప్రధానిగా బాధ్యతలు చేపట్టటం కంటే బాల్యావస్థలో ఉన్న రాహుల్, ప్రియాంకలను పెంచి పెద్దచేయటమే రాజీవ్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని సోనియా భావించారు. రాజీవ్ హత్యానంతరం తిరిగి తాను కావాలనుకుంటే ఇటలీ తిరిగి వెళ్లే అవకాశం కూడా ఉంది. కానీ సోనియా దీనికి సిద్ధపడలేదు. తన శేషజీవితాన్ని ఇక్కడే గడపాలని నిర్ణయించుకున్నారు. అధికారాన్ని విసర్జించిన సోనియా రాజీవ్ గాంధీ ఫౌండేషన్ పేరుతో ఒక స్వచ్ఛంద సంస్థ స్థాపించి వికలాంగులు, గ్రామీణ అభివృద్ధి వంటి రంగాలపై దృష్టి సారించారు. కాంగ్రెస్ పగ్గాలు చేపట్టాలని పదే పదే ఇందిరా, రాజీవ్ అనుయాయులు, వారి కోటరీ విజ్ఞప్తి చేసినా అందుకు అంగీకరించలేదు. అన్నిటి కంటే తన పిల్లల భద్రతే తనకు ముఖ్యమని ఆమె ప్రకటించారు. ఎంత పెద్ద కుటుంబానికి చెందినా ఆమెకూడా తల్లే కదా! తర్వాత పి.వి.నరసింహారావు, సీతారాం కేసరిల మధ్య వచ్చిన విబేధాలు పెరిగి పెద్దవై పార్టీని విచ్ఛిన్నం చేసే స్థితికి చేరటంతో అటు పార్టీని వదిలి వెళ్లలేని వారు, పార్టీతోనే తమ రాజకీయ భవిష్యత్తు ముడి పడి ఉందని భావించిన వారందరూ తిరిగి సోనియా చుట్టూ చేరి పార్టీ అధ్యక్ష పదవి చేపట్టాలని ఒత్తిడి తేవటం మొదలు పెట్టారు. ఈ సమయానికి రాహుల్, ప్రియాంకలు తమ నిర్ణయాలు, తాము తీసుకోగలిగిన స్థితికి వచ్చారు. అప్పటికే సోనియాపేరు దేశవ్యాప్తంగా ప్రచారంలో ఉంది. ఈ పరిస్థితుల్లో పిడికెడు మంది వ్యక్తులు వందేళ్ళ చరిత్ర గల పార్టీని ధ్వంసం చేయటాన్ని చూస్తూ ఊరుకోలేకపోయారు. పార్టీని పునరుద్ధరించి తిరిగి అధికారానికి తీసుకురావటం, దేశంలో కాంగ్రెస్‌కు గల స్థానాన్ని తిరిగి తెచ్చిపెట్టడం కూడా రాజీవ్ స్మృతికి నివాళి అర్పించటంలో భాగమేనన్న నిర్ధారణకు సోనియా వచ్చారు. సోనియా మారుతున్న తీరును ముందుగా పసి గట్టకలిగిన సంఘపరివారం, బిజెపిలు ఆమెపై బురదజల్లుడు మొదలు పెట్టాయి. బోఫోర్సు సమస్య పలు సార్లు చెట్టుపై బేతాళుడిలా మళ్లీ మళ్లీ పైకి లేచింది. సుబ్రహ్మణ్య స్వామి, ప్రభునాధ్‌సింగ్ వంటి వారు ఏకంగా సోనియా గాంధీపై విగ్రహాలు దొంగలించిందని ఢిల్లీ కోర్టులో కేసులు కూడా వేశారు. అంతటితో ఆగకుండా సెప్టెంబరు 2002లో రక్షణశాఖ మంత్రి హోదాలో ఇటలీ పర్యటించిన ఫెర్నాండెజ్ అర్బెస్సెనోలో గల సోనియా సోదరి షాపులోకి వెళ్లి భారతదేశం నుండి

డాక్టర్. మన్‌మోహన్ సింగ్

సోనియా గాంధీకి వ్యతిరేకంగా సంఘపరివారం ప్రచారం చేస్తుండటంతో ప్రత్యామ్నాయ నేతగా డాక్టర్ మన్‌మోహన్‌సింగ్ పేరును ఆమె ప్రతిపాదించారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీలో ఎవరికీ ఇష్టం లేకున్నా ప్రధాని పదవిని తీసుకోరాదనే తన నిర్ణయాన్ని పునః పరిశీలించకుండా, మన్‌మోహన్‌నే ప్రధాని అభ్యర్థిగా ఉంటారని స్పష్టం చేశారు. పంజాబ్, కేంబ్రిడ్జి, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాల్లో చదివిన డాక్టర్ మన్‌మోహన్‌సింగ్ రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మొదలు ప్రపంచబ్యాంక్ వరకు అనేక పదవులను అధిష్టించారు. పి వి నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో ఆర్థికమంత్రిగా దేశంలో ఆర్థిక సంస్కరణలను ప్రారంభించారు. ప్రణాళికాసంఘం ఉపాధ్యక్ష పదవి సహా ఆర్థిక శాఖలో అనేక ఉన్నత పదవులను నిర్వహించారు. 1985-87 సంవత్సరాల నడుమ రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా ఉన్న మన్‌మోహన్‌సింగ్ 1991లో రాజ్యసభ సభ్యుడయ్యారు. ప్రస్తుతం రాజ్యసభలో కాంగ్రెస్ పక్ష నాయకునిగా ఉన్నారు. 1999లో ఎన్‌డిఏ ప్రభుత్వం పతనమైనపుడు సోనియా గాంధీ కాంగ్రెస్ తరపున మన్‌మోహన్ పేరునే ప్రత్యామ్నాయ ప్రభుత్వ నేతగా ప్రతిపాదించారు. అయితే అప్పుడు లోక్‌సభను రద్దు చేసి ఎన్నికలు జరిపించారు. తాజా పరిణామాల నేపథ్యంలో 72 ఏళ్ళ మన్‌మోహన్‌సింగ్‌ను ప్రధాని పదవి అనుకోకుండా వరించింది.



రాజీవ్, సోనియా వివాహ దృశ్యం

నవదంపతులతో ఇందిరాగాంధీ

దొంగిలించబడిన విగ్రహాలు అక్కడ అమ్ముతున్నారేమో పరిశీలించి కూడా వచ్చారు!

కాంగ్రెస్‌లో చేరిక

సాధారణంగా పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు చేరటానికి అందరూ ఉత్సాహం చూపుతారు. 1991లో అధికారం చేపట్టమన్నప్పుడు తిరస్కరించిన సోనియా 1998లో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పగ్గాలు చేపట్టారు. కాంగ్రెస్‌ను పునరుజ్జీవింప చేయటమే అప్పట్లో సోనియా ఏకైక లక్ష్యం. 1999లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీల సంఖ్య కనిష్టస్థాయికి పడిపోయింది. గత ఎనిమిదేళ్ల కాంగ్రెస్ సాధించిన విజయాలు, పరాజయాలను సోనియాకు వర్తింప చేయటం జరుగుతూ వచ్చింది. 1999లో శరద్‌పవార్, సంగ్మాలు తిరుగుబాటు బావుటా ఎగరవేసి విదేశీ మూలాలున్న వ్యక్తి నాయకత్వంలోని కాంగ్రెస్‌లో పని చేయలేమంటూ జాతీయవాద కాంగ్రెస్ పార్టీ ప్రారంభించారు. ఈ కాలంలో కాంగ్రెస్‌ను పటిష్టపర్చటంతో పాటు కాంగ్రెస్‌లో తన నాయకత్వాన్ని కూడా పటిష్టపర్చుకొంటూ సోనియా గాంధీ పని చేశారు. 99లో వాజ్‌పేయి ప్రభుత్వాన్ని కూలదోస్తూ తీర్మానం ఆమోదించినప్పుడే సోనియాగాంధీ ఇంకా రాజకీయాల్లో పరిణితి సాధించాలన్న వాస్తవం గమనార్హం. తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున స్టార్ క్యాంపెయినర్‌గా తిరగటం, లోక్ సభలో కాంగ్రెస్ పార్టీ అతి పెద్ద పార్టీగా అవతరించటం, లౌకిక సంకీర్ణం ఏర్పాటుకు రంగం సిద్ధం కావటం ఎన్‌డిఎను గద్దెదించి నూతన ప్రభుత్వం ఏర్పాటుకు చర్యలు తీసుకోవటం, సోనియా నాయకత్వాన్ని వ్యతిరేకిస్తూ సుష్మాస్వరాజ్, ఉమాభారతి, మొత్తం ఎన్‌డిఏ దేశవ్యాప్త ఉద్యమం నడపాలని నిర్ణయించటం రుజువయ్యింది. వాజ్‌పేయి ప్రభుత్వాన్ని పడేసినా ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయటంతో సోనియాను వ్యక్తిగతంగా విమర్శించేందుకు బిజెపికి పెద్ద సాధనం దొరికింది. అప్పట్లో కూడా రాష్ట్రపతి నారాయణన్‌కు మన్మోహన్‌సింగ్ పేరే ప్రతిపాదించటం నడుస్తున్న చరిత్రలో అధ్యాయాలు.

రాజకీయ నిర్వాణం

1991లో తాను ఇచ్చిన మాటకు సోనియా నేటికీ కట్టుబడి ఉంది. తాను అధికారం చేపట్టాలన్న ఆలోచనతో లేనని అప్పట్లో ప్రకటించారు. దీంతో కాంగ్రెస్ నాయకులందరూ ప్రత్యామ్నాయంగా పి.వి.నరసింహారావు ను ఎన్నుకున్నారు. తాజాగా ఎన్నికల ఫలితాలు వచ్చిన రెండు రోజుల్లో కాంగ్రెస్ పార్టీ నాయకురాలిగా ఎన్నికయినా, తర్వాత తనకు పదవినధిష్టించాలన్న యోచన లేదని ప్రకటించారు. తద్వారా సోనియా తాను రాజకీయ నిర్వాణం పొందటంతో పాటు, భారతీయ సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం అని తమకు తాము కితాబులిచ్చుకుంటున్న బిజెపి, సంఘపరివారానికి భారతీయ సాంప్రదాయంలో అధికార దాహానికి ఎప్పుడూ తావు లేదని మరోసారి రుజువు చేశారు. ప్రజలు తీర్పును గౌరవించి ప్రతిపక్ష పాత్ర పోషించేందుకు సిద్ధం కాని బిజెపి ఎలాగైనా సాధ్యమైనంత త్వరగా తిరిగి అధికారం పొందడానికి తహతహలాడుతోంది. ఇందులో భాగమే ఉమాభారతి, సుష్మాస్వరాజ్‌ల ఉద్యమం, దానికి బిజెపి మద్దతు. ఇది ఆధునిక భారత చరిత్రలో మరో మాయని మచ్చ. సోనియా నాయకత్వంలో వామపక్షాల మద్దతుతో లౌకిక ప్రభుత్వం ఏర్పాటయితే దానికి ఐదేళ్ల వరకు తిరుగుండదన్న వాస్తవాన్ని బిజెపి గ్రహించింది. అందుకే భారత రాజకీయాల్లో బ్రాండ్ పేరుగా ఉన్న గాంధీ, నెహ్రూ కుటుంబ వారసత్వం ఉన్న సోనియా గాంధీ ప్రభుత్వంలో ఉన్నంతవరకు ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకు కాంగ్రెస్ వారెవ్వరూ సిద్ధపడరు. అందువలన ముందుగా సోనియాను వ్యక్తిగత లక్ష్యంగా ఎంచుకుని జాతీయదురభిమానాన్ని ప్రదర్శిస్తూ రాజ్యాంగానికతీతమైన ప్రశ్నలను ముందుకు తెచ్చి ప్రతిపాదిత ప్రధాని పదవినుండి సోనియా తప్పుకునేలా చేశాయి. సోనియా తప్ప మరెవ్వరు నాయకులుగా ఉన్నా కాంగ్రెస్‌ను చీల్చటం, లేదా సంకీర్ణంలో భాగస్వాములను విడదీయటం కష్టం కాదన్నది బిజెపి ఆలోచన. సాధారణంగా కోడలిగా ఇంటికి వచ్చిన పరాయి ఇంటి ఆడపడుచును ఇంట్లోని దాయాదులు, అత్తమామలు వేధిస్తారన్నది వరకట్న హింస, గృహహింసలో మనం చూస్తున్న సంఘటనలే. సతీసహగమనం, వరకట్నం వంటి ప్రగతి నిరోధక భావాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘపరివారం పరాయి దేశం నుండి భారతదేశానికి కోడలిగా వచ్చిన సోనియాను సూటిపోటి మాటలు, చేతలతో హింసించటం ద్వారా తమ స్వభావాన్ని నిరూపించుకుంది. దీనికి బిజెపి నాయకులు జాతీయాభిమానం, దేశభక్తి అని చెప్పుకొంటూ ఆ పదాలకు విలువలేకుండా చేస్తున్నారు. ఈ దేశానికి వచ్చిన విదేశీయులైనా దేశ సంస్కృతి సాంప్రదాయాలు నేర్చుకుని గౌరవిస్తే ప్రజలు వారికి బ్రహ్మరథం పడతారన్న భారత దేశ చరిత్రను సోనియా గాంధీని ప్రధానిగా అంగీకరించటం ద్వారా 21వ శతాబ్దంలో కూడా మరోసారి రుజువు చేశారు. బిజెపి నాయకుల జాతీయ దురభిమానానికి, దురహంకారానికి బలైన మహిళగా పాశ్చాత్య ప్రపంచం దృష్టిలోను, సగటు భారతీయుని ఆలోచనల్లోను సోనియా గాంధీ మిగిలిపోతారు. ★



కూతురు, అల్లుడితో సోనియా



రాహుల్, ప్రియాంకలతో ఇందిర, సోనియా



తమ చిన్నారులతో రాజీవ్ దంపతులు

సమస్య

డా॥ మానేపల్లి

మళ్ళీ తగువు మొదలైంది.
తండ్రిపోయిన మర్నాడే తలెత్తింది.

ఆ మాటకొస్తే తండ్రి ఉన్నప్పుడే వచ్చింది. ఆయన తన ఆస్తిని అందరూ సమానంగా పంచుకోమని చెప్పాడు. చెప్పనైతే చెప్పారు గాని అంతకుముందే రాసిన విల్లులో కొడుకులు ముగ్గురూ సమానంగా పంచుకుని సుఖంగా అనుభవించవలసిందిగా రాశారు. కూతుళ్ళకు వివాహ సమయాన ఇవ్వవలసింది ముట్టుజెప్పాను. ఇందులో భాగం లేదని కూడా రాశారు.

సుమారు పాతిక సెంట్ల స్థలంలో కట్టిన ఎనిమిది సెంట్ల విశాలమైన భవనం. మూడు వాటాలు. చుట్టూ రకరకాల చెట్లు. మామిడి, నేరేడు, వేప, కుంకుడు, నిమ్మ, సపోటా, సీతాఫలం, కొబ్బరిచెట్లు - కరివేపాకు, బొప్పాయి, అరటి, గోరింట చెట్లు - కాక లెక్కలేనన్నిపూల చెట్లు - మల్లి, మందారం... ఇల్లు కాదది పెద్ద ఎస్టేటు. చవక రోజుల్లో 1976 ప్రాంతాల్లో స్థలం కొని స్వయంగా కట్టించిన ఇల్లు. ఇవ్వాళ అంటే 2004లో తక్కువలో తక్కువ - పదిహేను లక్షలకు పైనే గాని తక్కువ రాదు. రెండెకరాల కొబ్బరి తోట వుంది. ఈ మధ్య పెద్దగా దిగుబడి లేదు.

కొడుకులందరూ మంచి ఉద్యోగాల్లో వున్నారు. కూతుళ్ళ పనీ బాగానే వుంది. ఆయన జీవిత కాలంలో ఎవ్వరూ ఆస్తి పంపకాల గురించి ఎత్తనే లేదు. ఆ అవసరం కూడా లేకపోయింది.

"నాన్న అలా చెప్పారు కదా అలా చేద్దాం" అన్నది పెద్ద కూతురు కాంతమ్మ. తండ్రి కంటే తల్లి ముందు పోయింది. ఆమె ఒంటి మీద బంగారం, బోలెడన్ని పట్టుచీరలు, కొద్దిపాటి వెండిసామానూ కూతుళ్ళే తీసుకున్నారు.

కట్నాలూ, కానుకలూ ఇచ్చి పెళ్ళిళ్ళూ చేసి, అమ్మ బంగారమూ పంచి - మళ్ళీ ఇప్పుడు ఆస్తి పంచమంటే ఎలాగా? - అంటూ కొడుకులు, ముఖ్యంగా కోడళ్ళు.

చదివించడానికి మీకు మాత్రం ఖర్చు కాలేదా? - అని కూతుళ్లు.

అయింది నిజమే గాని - ఉద్యోగంలో చేరిన క్షణం నుంచీ మేం తండ్రికి ఎంతోకొంత ఇస్తూనే వచ్చాం. చివరి ఇద్దరు కూతుళ్ళ పెళ్ళికీ ఖర్చు చేశాం. మీరేనాడన్నా ఒక్క పైసా ఖర్చు చేశారా అన్నారు కొడుకులు. ఇల్లు కట్టినప్పుడు కాకపోవచ్చు - ఆ తరువాత ఇంటిమీద కూడా కొడుకులు ఖర్చు పెట్టారు. ప్రహరీగోడ కట్టించారు. నూతి చుట్టూ బాగు చేయించారు. బాత్‌రూముల్లో కొళాయిలు వేయించారు. ఇంటి ముందు కర్రగేటు తీసేసి పెద్ద ఇనుపగేటు పెట్టించారు. డాబా మీద గది కట్టించారు. ఇంటినిండా బోలెడు సామాన్లు - ఫాన్లు, కుర్చీలు అలమారలు చాలా చేయించారు. ఆడవాళ్ళు ఏనాడూ పైస ఖర్చు చెయ్యలేదు. నిజమే. కాని ఎందుకు చేస్తారు?

మరైతే పంపకాలకు వస్తారేం!

తండ్రికి రెండు వందలతో ప్రారంభమైన పెన్షను, చచ్చిపోయే నాటికి రెండు వేలయింది. ఈ రోజుల్లో అది ఎంత? తిండికీ, మందులకీ అలా సరిపోయేది. తల్లీ తండ్రి తూర్పు వాటాలో వుంటూ మిగతా రెండు వాటాలూ అద్దెకిచ్చారు. చెరో ఆరొందలూ వస్తాయి. అందులో కొంత ఇంటి పన్నుకీ, ఏటా సున్నాలు వేయించడానికి ఖర్చయ్యేది. మిగతాది



బ్యాంకులో వేసేవారు.

తల్లి జబ్బులకి ఎక్కువ ఖర్చు కాలేదు. తొందరగానే పో యింది. ధన్యు రాలు. తండ్రికి మాత్రం ఎక్కడలేని సొమ్మూ ఖర్చయింది. ఒక దశలో ఇంటిమీద అప్పు తేవాలా అన్న ఆలోచన కూడా రాకపోలేదు. కాని తేలేదు. కొడుకులే పెట్టారు. ఆఖరి రెండేళ్ళూ ఆయనతో నానా హింసా పడ్డారు. నానా చాకిరీ చేశారు. చిన్నప్పుడెత్తుకుని పెంచలేదా ఇంతవాళ్ళని చెయ్యలేదా అంటే - చిన్నప్పుడు ముద్దు, సంతోషం. ముసలితనంలో వున్నంత ఛండాలం వుంటుందా?

ముసలితనంలో ఎవరిక్కావాలి? ఆఖరి రోజుల్లో మరీను, ఎక్కడ పడితే అక్కడ మలమూత్రాలు, వాంతులు - ఘోరం బాబోయ్ ఘోరం.

అందరికీ అనాయాస మరణమే కావాలి. కాని రావద్దూ-

"పోనీ కొన్నాళ్ళు - ఇల్లు అమ్మకం, ఆస్తి పంపకం వాయిదా వేద్దాం" అన్నాడు పెద్దవాడు ఆదినారాయణ.

ఆ మాట ఆడపిల్లలకి నచ్చలేదు. ఏమో ఎప్పటికెలా వుంటుందో, తల్లీ, తండ్రి ఎలాగూ పోయారు. ఇప్పుడా ఇల్లు వుంచుకుని చేసే పనేం వుంది? అందరికీ ఎవరి సొంత ఇల్లు వాళ్ళకుండనే వున్నాయి. తండ్రి కట్టిన ఇల్లు కదా అని ఉద్యోగాలు, వ్యాపకాలూ వదులుకుని ఎవరూ అక్కడికొచ్చి వుండరు కదా - అన్నది పెద్దమ్మాయి కాంతమ్మ.

'మరి దాన్ని ఎవరు మెయిన్‌టెయిన్ చేస్తారు?" అన్నాడు చిన్నవాడు చిన్నారావు.

చిన్నవాడు కదా అని అందరూ అతన్నే సాగదీస్తారు. అన్నలకి, అక్కలకి ఎదురు చెప్పలేక అన్ని పనులూ నెత్తిన వేసుకొంటాడు.

నెలనెలా అద్దె వసూలు చేయాలి, కరంటు బిల్లు కట్టేలా చూడాలి. ఇంటి పన్ను కట్టాలి. అవన్నీ కాక బోలెడు ఫలసాయం, కొబ్బరికాయలు, మామిడి కాయలు, కుంకుళ్ళు - ఒకటేమిటి? అవన్నీ ఏం చెయ్యడం?

"అన్నీ అద్దెకున్న వాళ్ళు ఎదానపోసుకుంటున్నారు" అన్నది రెండో కూతురు.

"అయితే నువ్వెళ్ళు అక్కడ కాపలా కూచో, కావాలంటే అన్నీ నువ్వే అనుభవించు" అన్నది చిన్నకూతురు.

మాజీ గ్రామసర్పంచ్ రామానాయుడు ఇల్లూ స్తలమూ అంతా కలిపి ఎనిమిది లక్షలకడిగేడు.

"వాడికదేం పోయే కాలం చవగ్గా పడేసుకుందామనే"

"కనకరత్నం గాని కొంటారేమో అడగలేకపోయారూ"

"ఎవరైనా మనంతట మనం అడగబోయేసరికి అలాగే వుంటుంది-"

"ఎవరో ఒకరు వచ్చేదాకా ఆగమన్నానా?"

"ముందు మనం అమ్మజూపితే కదా"

"వాళ్ళంతట వాళ్ళే రావాలంటే అయ్యే పనికాదు"

"బ్రోకర్లకప్ప చెబితే ముంచేస్తారు."

బ్రహ్మచారి వచ్చాడు, రేపటి కార్యక్రమం కోసం వంటకి ఏర్పాటు చెయ్యాలి. గ్లాసులూ, తువ్వాళ్ళూ ఇంకా ఏవేవో కొనాలి. భోక్తలకి చెప్పాలి. బోలెడు పనులున్నాయి.

ఆడవాళ్ళు లేచి లోపలికెళ్ళారు.

తండ్రి ఫొటో ఒకటి పెద్దసైజుది చేయించి తెచ్చాడు చిన్నవాడు చిన్నారావు. అందరికీ మనసులో బాధగా వుంది. తండ్రిపోయాడంటే ఎవరికీ నమ్మశక్యం కాకుండా వుంది. ఇంకా ఇంట్లో తిరుగుతున్నట్టే వుంది.

కార్యక్రమం ముగిసింది. మరీ క్లుప్తంగా కాకుండా మరీ భారీగా కాకుండా చేశారు. బ్రహ్మచారికి బాగానే ముట్టింది. దినవారాలకు చేసిన ఖర్చుల మీద



కొంత చర్చ జరిగింది. సులువుగానే అంగీకారానికి వచ్చారు. పితృకార్యానికి తగువులేల?

మధ్యాహ్నం క్రమంగా సాయంత్రంగా మారుతోంది. నాలుగయ్యింది. దీపాలు పెట్టేసరికి ఎక్కడివాళ్ళక్కడికి వెళ్ళాలి. ఆరుగురూ ఆరువూళ్ళు. చుట్టాలు ఒకరొకరే వెళ్ళిపోయారు. ఊళ్ళో వాళ్ళు భోజనాలు కాగానే వెళ్ళిపోయారు.

మళ్ళీ తగువు మొదలైంది. ఈసారి రెండో కోడలు ఎత్తింది. మామూలుగానే అన్నది. కాని ఆ తరువాత మాటలు మామూలుగా లేవు.

కూతుళ్ళు ఎందుకాలస్యం నెలలోకా అన్నీ చక్కబెట్టెయ్యమంటున్నారు. అల్లుళ్ళు పెళ్ళాల్ని ఎగదోస్తున్నారు గాని పెద్దగా కల్పించుకోవడం లేదు.

కట్నాలూ, కానుకలూ ఇచ్చి పెళ్ళి చేసినపుడు ఆస్తిలో వాటా ఉండదు - అనేవాదన మళ్ళీ ముందుకొచ్చింది.

అలాగని కట్నకానుకల్లేని పెళ్ళి చేసుకోవాలి. ఎవరు చేసుకుంటారు? ఆస్తి ఎగ్గొట్టడానికి ఇదొక సాకు - ఒకరు.

కట్నాలూ ఇచ్చి - ఆస్తిలో వాటా కూడా ఇస్తారా? - ఇంకొకరు.

మాటలు పెరిగాయి. చాలా దూరం కూడా వెళ్ళాయి.

అన్నదమ్ముల మాటలు కొంతలో కొంత అనుకూలంగానే వున్నాయి. ఎంతలేదన్నా ఆ రక్తం పంచుకు పుట్టిన వాళ్ళే కదూ సమానంగా కాకపోయినా ఎంతోకొంత ఇద్దాం. వాళ్ళ మనసు కష్టపెట్టడం దేనికీ - ఇదీ వాళ్ళ ఆలోచన, ప్రస్తుతం.

నిన్నా, ఇవ్వాళా రగడ వల్ల కొంత మార్పు వచ్చింది.

ఇంతేనన్నమాట, మనుషుల మీద అభిమానాలూ, ఆపేక్షలూ వుండవన్నమాట' అన్నది పెద్దకూతురు కాంతమ్మ.

ఆస్తి పంచితే వున్నట్టూ లేకపోతే లేనట్టూనా అని ఎదురు ప్రశ్న.

పెద్దవాడు ఆదినారాయణ బాగా అభ్యుదయ భావాలు కలవాడు. బంధుత్వాలన్నీ ఆర్థిక సంబంధాలేనని చదువుకున్నాడు. అది నిజమేనని నమ్మాడు. ఇప్పుడు చూస్తున్నాడు. భౌతిక సంపదల కతీతంగా మానవ సంబంధాలుండవు. ఇందుకు తిరుగులేదు. ఆ విషయం ప్రత్యక్షంగా చూస్తున్నాడు.

చూనన్తాచూనన్తా వుండగానే పొద్దుమళ్ళుతున్నది.

కాఫీలు తాగేవాళ్లకి కాఫీలూ, టీలు తాగేవాళ్ళకి టీలు వచ్చాయి.

"నువ్వు వెంటనే మిగిలిన గిన్నెలు కడిగేసి చక్కబెట్టే" అన్నది కాంతమ్మ.

తూర్పు వాటాలో ఇంకా బోలెడు సామాను అలాగే వుంది. వంటపాత్రలూ, మంచాలూ, బల్లలూ, కుర్చీలు, ఫ్యాన్లూ, పెద్ద కావిడి పెట్టినిండా బట్టలు...

ఇవాల్టికి ఈ వాటాకి తాళం పడాల్సిందే.

"అమ్మకీ నాన్నకీ సంవత్సరీకాలు ఇక్కడే చేద్దాం. ఈలోగా బేరాలు పెడదాం. అవి పూర్తయ్యాక రేటు చూసుకుని అమ్మొచ్చు" అన్నాడు పెద్దవాడు. అమ్మపోయిన మూడు నెలల్లో నాన్నపోయారు. సంవత్సరీకాలు రెండూ దగ్గర్లోనే వస్తాయి.

అంతవరకూ దేనికీ అన్నట్టున్నాయి ఆడపిల్లల చూపులు.

"ఏ కొడుకు ఇంట్లోనో చేస్తే, అంతా అక్కడికి రావడం కన్నా, అమ్మా నాన్న కట్టుకున్న ఇంట్లోనే సంవత్సరీకాలు చెయ్యడం ధర్మం."

ఇదీ బాగానే వుంది అన్నారు మిగతా ఇద్దరు కొడుకులూను.

"ఈలోగా రేటు పెరగొచ్చు" అన్నది రెండో కోడలు.

"పెరుగుతుందో - ఇల్లు పాడై తరుగుతుందో" అన్నది రెండో కూతురు.

ఇంతలో వచ్చింది కనకరత్నం. సుమారు యాభైఏళ్ళుంటాయి. రోడ్డు దాటితే ఎదురిల్లే. ఇల్లు కట్టిన కొత్తల్లో పాలూ పెరుగూ పోసేది. పదెకరాల పొలం, రోడ్డు పక్కన రెండిళ్ళు వున్నాయి. కులం ఒకటి

(మిగతా 15వ పేజీలో)



డా॥ ముదిగంటి సుజాతారెడ్డి

ప్రకటనల్లో విషసంస్కృతి

ఈ మధ్య ఒక యాడ్ చూసి చాలా ఆశ్చర్యపోయాన్నేను. యాడ్స తయారు చేసే వాళ్ళ సృజనాత్మకత ఎంత తీవ్రంగా పని చేస్తోందో అర్థమైంది. పవిత్రమైందనుకునే దాన్ని కూడా వాళ్ళు ముక్కచెక్కలు చేయకుండా వదలటం లేదు. ఇన్నాళ్ళు దేవదాసు ప్రేమ పవిత్రమైంది. నిస్వార్థమైందనుకున్నాం. శరత్ చంద్ర ఛటర్జీ ఇరవయ్యో శతాబ్దం ఆరంభంలో సృష్టించిన దేవదాసు పార్వతిల ప్రేమ కథ అతని రచనాశక్తి వల్లనో, సినిమాల ప్రభావం వల్లనో అజరామరమైంది. దేవదాసు పార్వతీల ప్రేమజంట లైలా మజ్నూ, షిరీ ఫర్హాద్, రోమియో జూలియెట్ వరుసలో చోటు చేసుకుంది. అటువంటి దేవదాసు ప్రేమను కూడా యాడ్ వాళ్ళు వెక్కిరించి అతని మనస్సును దివ్యమైన ప్రేమ నుంచి వ్యాపార వస్తు వ్యామోహంలోకి మార్చారే అని ఆలోచిస్తూ నన్ను నేనే మరచిపోయి కూర్చొని వున్నాను. అప్పుడే దబదబమని లలిత గదిలోకి వచ్చింది. సోఫాలో కూలబడింది. "ఏందే! అంత లోతుగా ఆలోచిస్తున్నావు. నేను వచ్చి కొన్ని నిమిషాలైంది! నేను వచ్చిందైనా గుర్తించ కుండా మైమరచి పోయావేం సంగతి?" గట్టిగా అంది లలిత. దాని గొంతు తీవ్రతకు నేను బయటి ప్రపంచం లోకి వచ్చి పడ్డాను. "ఏం లేదే!" అని నిట్టూర్చాను.

"ఇంత మైమరచిపోయి ఆలోచిస్తున్నావు ఏం లేకుండా ఎట్లా వుంటుంది. అసలు సంగతేమిటో చెప్పు. మాకూ తెలుస్తుంది. ఏమైనా ఎలక్షన్లు వాటి ఫలితాల గురించి ఆలోచిస్తున్నావా ఏంది?" అంది లలిత చిరునవ్వుతో.

"అది కాదే! మొన్నొక యాడ్ చూశాను. దాన్ని గురించే ఆలోచిస్తున్నాను" అన్నాన్నేను.

"యాడా! అంటే వ్యాపార ప్రకటనా? - దాన్ని గురించి ఇంత మైమరచిపోయే ఆలోచన ఏందే?" అంది లలిత విస్తుపోతూ.

ఆ యాడ్‌లో దేవదాసును చూపించారే. మొదట దేవదాసు ప్రేమతో "పారో! పారో!" అంటుంటాడు పరవశమైపోయి. వెంటనే "యూరో! యూరో!" అని టైల్స్ పైన నిమురుతూ పరవశమైపోతాడు. పారోకు యూరోకు ప్రాస కలుపుతూ తీసిన ఈ యాడ్ ఏ మహానుభావుడు సృష్టించాడో కాని చాలా ఘోరంగా వుంది. అందరూ అభిమానించి చదివే దేవదాసు కథను, అతని ప్రేమను పరిహాసం చేసేటట్లుగా వుంది. అట్లా సాహిత్య సంబంధమైన సంస్కృతి మొదలైన విషయాలను పరిహసించే విధంగా, అవమానించే విధంగా, తక్కువచేసే విధంగా వుండే యాడ్‌లను అనుమతించకూడదు. స్వేచ్ఛ పేరుతో ఈ విధంగా ప్రతి విషయాన్ని పరిహాసంగా వాడుకోవటం మంచిది కాదు" అన్నాన్నేను కొద్దిగా ఆవేశంగా.

"నువ్వనేది నిజమేనే సుశ్శీ! నేను మోటార్ సైకిల్‌కు సంబంధించిన యాడ్ చూసి విస్తుపోయాను. అందులో యువకుడు తల్లిదండ్రుల కోరికను కాదని నిరాకరించి ఇప్పుడే నాకు పెళ్ళి వద్దంటాడు. భార్య కోరిక కాదని ఇప్పుడే పిల్లలు వద్దంటాడు: ఇప్పుడే స్వంత ఇల్లూ అవసరం లేదంటాడు. "ఐ వాంటెడ్ టు బి మీ - నేనునేనుగా వుండాలనుకుంటున్నాను" అని మోటార్ సైకిల్ కొన్కుక్కొని స్వైర విహారం చేయాలని ఆశపడతాడు..." లలిత మాటలు పూర్తి చేయకముందే నేనందుకున్నాను.

"అంటే ఆ యువకుడు కుటుంబం దాని బంధనాల నుంచి విముక్తుడై స్వేచ్ఛగా మోటార్ సైకిల్ మీద వీర విహారం చేస్తూ బతకాలనుకుంటాడు! అంతేనా" అన్నాను.

"అంటే తల్లితండ్రుల ఆశలు, భార్యా పిల్లలూ కొంపోగోడూ ఏదీ లేకుండా స్వేచ్ఛగా బతకాలని పాపం ఆ యాడ్ సృష్టించినతను బోధిస్తున్నాడు. మోటార్ సైకిల్ అమ్ముకోవాలనే ఆశ ఆ కంపెనీకి వుంటే వుండవచ్చును. కాని యువతను ఈ విధంగా రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం మాత్రం మంచిగా లేదేమో అనిపించింది నాకు. ఏమంటావు సుశ్శీ!" అంది లలిత నా తీర్పుకోసం ఎదురుచూస్తూ. అదేనే నేను ఇంత సేపు చెప్తున్నది. ఉత్పత్తి అయిన వస్తువులను అమ్ముకోవ టానికి వాళ్ళు అప్పీళ్ళు పడటమే వాళ్ళకు తెలుసు. కాని ఇటువంటి విపరీత భావజాలాన్ని ప్రచారం చేసి యువత ను పెడతోవ పట్టిస్తున్నామని వాళ్ళు తెలుసుకోవటం లేదు. ఏది ఏమైనా విషసంస్కృతికి బీజాలు చల్లుతున్నారు!" అన్నాన్నేను నిట్టూరుస్తూ. ★



మేకల మదన్‌మోహన్‌రావు

సాధు సర్పం

"దుష్టులు హాని చేసినప్పుడు మంచి వాళ్లు ఏం చెయ్యాలి?" అని ప్రశ్నించిన తన శిష్యులకు రామకృష్ణపరమహంస ఈ కథ చెప్పాడు.

* * *

ఒకానొక మైదాన ప్రాంతంలో ఓ భయంకరమైన విష సర్పం వుండేది. పశుకాపరులు అది వుండే మైదాన ప్రాంతానికి వెళ్లటానికి భయపడేవారు.

ఒకరోజు ఓ సాధువు ఆ దారిన వెళ్తున్నాడు. ఆయన మైదానంలోకి ప్రవేశించ బోతుండగా ఆ పల్లెటూరి పిల్లలంతా ఆయనను వారించి, "అయ్యా! అటు పోకండి. అక్కడొక భయంకర విషసర్పం వుంది" అని చెప్పారు.

కానీ ఆ సాధువు, "నాకు పామంటే భయం లేదు పిల్లలూ!" అని చెప్పి, ముందుకు సాగాడు.

ఆ పాము ఆయన్ని చూడనే చూసింది. పడగ విప్పి, భయంకరంగా బుసకొడుతూ కాటేయడానికి వచ్చింది. కానీ ఆ సాధువు ఏ మాత్రం భయపడలేదు. ఏదో మంత్రం పఠించాడు. అంతే! పాము జవసత్వాలు లేనిదానిలా మారింది. వానపాములా ఆయన పాదాల చెంత చేరింది.

"ఇలా చూడు! నువ్వెందుకిలా అందరికీ హాని చేస్తున్నావు? నీకొక మంత్రం ఉపదేశిస్తాను. దాన్ని పఠిస్తూ వుంటే నీ హింసా ప్రవృత్తిని కోల్పోయి, చివరికి ఆ దైవాన్ని చేరుకుంటావు" అంటూ దానికి మంత్రోపదేశం చేశాడు. అంతేకాకుండా 'ఈ మంత్రాన్నే జపిస్తూ వుండు. ఎవ్వరికీ హాని చేయకు' అని చెప్పాడు.

వెళ్తూ వెళ్తూ "మళ్లీ ఎప్పుడో ఓసారి వచ్చి నువ్వెలా వున్నావో చూస్తా" అని కూడా చెప్పాడు.

కొన్ని రోజులు గడిచాయి. పాము ఎవరి జోలికీ వెళ్లకుండా వుండటం ఆ పల్లె బాలురు గమనించారు. వాళ్లకు కొంచెం ధైర్యం వచ్చి దాని మీదకు రాళ్లు విసరసాగారు. అది ఏమాత్రం కోపగించుకోలేదు.

ఓ అబ్బాయి దాని దగ్గరకు వచ్చి పాము తోక పట్టుకుని గిరగిరా తిప్పి, నేలకేసి కొట్టి దూరంగా విసిరి పారేశాడు. ఆ పాము రక్తం కక్కుకుని కదలకుండా మెదలకుండా పడుకుంది. అది చూసి పాము చచ్చిపోయిందనుకుని పిల్లలంతా వెళ్లిపోయారు.

ఆ తర్వాత అతికష్టంమీద పాము తన పుట్టలోకి దూరింది. దాని వెన్నుపూస పూర్తిగా విరిగిపోయింది. కదల్లేకపోయింది. అట్లా చాలా రోజులు గడిచిపోయాయి. ఆ పాము చర్మం కప్పుకున్న అస్థిపంజరంలా తయారైంది. పిల్లలకు భయపడి అది బయటకు రావడమే మానేసింది. అప్పుడప్పుడు రాత్రిళ్లు ఆహారం కోసం బయటకు వచ్చేది. ఆకులు, అలములు, చెట్ల నుంచి రాలిపడిన పళ్లు తిని జీవించసాగింది.

ఒక సంవత్సరం తర్వాత సాధువు మళ్లీ అదే దారిన వచ్చాడు. పాము గురించి ఆరా తీశాడు. "ఆ పాము చచ్చిపోయింది" అని పిల్లలు ఆయనకు చెప్పారు. కానీ ఆయన వాళ్ల మాటలు నమ్మలేదు. మైదానంలోకి వెళ్లి పామును ఎలుగెత్తి పిలిచాడు. తన గురువుగారి కంఠధ్వని విని ఆ పాము పుట్టలోంచి బయటకు వచ్చింది. ఆయన పాదాలకు ప్రణమిల్లింది.

"ఎలా వున్నావు?" అడిగాడు సాధువు.

"బాగానే వున్నానయ్యా" అంది సర్పం.

"మరి ఎందుకింతలా చిక్కిపోయావు?"

"అయ్యా! తమరు ఎవరికీ హాని చెయ్యొద్దన్నారు కదా. అందుకే నేను ఆకులు, అలములు, పళ్లు తిని జీవిస్తున్నాను. బహుశా అందుకే చిక్కిపోయానేమో."

"కేవలం ఆహార లోపం వల్లే నువ్వింతలా చిక్కిపోయి వుండవు. అసలు కారణం ఏమిటో చెప్పు."

"అవునయ్యా! ఇంకో కారణం వుంది. ఇప్పుడు నేను కరవటం మానేశాను. దాంతో పిల్లలకు నేనంటే భయం పోయింది. ఓసారి వాళ్లు నన్ను నేలకేసి బాదారు. కానీ వాళ్ల మీద నాకేం కోపం లేదు. ఎందుకంటే వాళ్లు పసివాళ్లు. ఏం చేస్తున్నారో వాళ్లకే తెలియదు" అంది పాము జాలిగా.

"సిగ్గు! సిగ్గు! ఎంత మూర్ఖురాలివి!? నిన్ను నువ్వు ఎలా రక్షించుకోవాలో కూడా ఎరగవు. నిన్ను కరవొద్దన్నాను కానీ బుస కొట్టొద్దనలేదు కదా. నువ్వు బుస కొట్టి ఆ పిల్లలను ఎందుకు భయపెట్టలేదు?" అన్నాడు సాధువు. అప్పుడు తను చేయవలసినదేంటో ఆ సర్పానికి బోధపడింది.



చిన్నారి చిత్రకారులు

ప్రదీప్ అంతటి,
6వ తరగతి,
విజయవాణి విద్యానికేతన్,
వెలిమినేడు, నల్గొండ.

ఎల్.వంశీకృష్ణ, 3వ తరగతి,
బ్రహ్మర్షి హైస్కూల్, రాధాబంగ్లా,
పలమనేరు.



బి.శ్రీలక్ష్మి,
5వ తరగతి,
[illegible]
భద్రాచలం,
ఖమ్మం.



ఎస్.గోపీచంద్,
10వతరగతి,
ఎస్‌వీఎస్‌పి స్కూల్,
చినకాకాని,
గుంటూరు.



కె.మౌనిక,
5వతరగతి,
రాహుల్ స్కూల్,
చీరాల.

ఎన్ని ముఖాలున్నాయి?



మ్యాజిక్ మ్యాజిక్

హాయ్! ఈ వారం మ్యాజిక్ మ్యాజిక్‌లో భలే తమాషా బొమ్మ తీసుకొచ్చాం.ముందు దాన్ని పరిశీలనగా చూడండి.ఏం కనిపించింది? 'ఏముంది? అదేదో అడవిలాగా వుంది. పెద్ద పెద్ద చెట్లు, చిన్న చిన్న రాళ్ల గుట్టలు, రెండు గుర్రాలు... ఇంకా నీళ్లు వున్నాయ అయినా ఇందులో ముఖాలేంటి?' అనుకుంటున్నారు కొందర చిన్నారులు. కానీ పిల్లలూ! ఈ ప్రకృతిలోనే కొన్ని ముఖాలున్నాయ నిజ్జం. చిత్రకారుడు అంత ప్రతిభావంతంగా బొమ్మ వేశాడు. మీరు ఈ చిత్రంలో వున్న మొఖాలను కనిపెట్టాలి. అవి ఎన్నో చెప్పాలి.

'అబ్బా! కాస్త కష్టమైన పనే అప్పచెప్పారే. అయినా ప్రయత్నిస్తా అవును. మీరు చెప్పాక అక్కడక్కడ ముఖాల ఆకారాలు కనిపిస్తున్నాయ కానీ అవి ఎన్ని అనేది మాత్రం చెప్పలేకపోతున్నాం' అంటున్నార ఎక్కువమంది చిన్నారులు.

సరే. మరి మమ్మల్నే చెప్పేయమంటారా? ఈ బొమ్మల కచ్చితంగా 13 ముఖాలున్నాయి. ఇప్పుడు పరిశీలనగా చూడం స్పష్టంగా కనిపిస్తాయి. అవునా! మరి అదే పరిశీలన అంటే... ఇదే ప్రశ్నన మీ మిత్రులను కూడా అడిగిచూడండి.

చుక్కలు కలుపండి



నది దాటడం ఎలాగంటే...

ముందు ఇద్దరు కొడుకులూ పడవమీద అవతలి ఒడ్డుకి వెళతారు. అందులో ఒకడు తిరిగి ఇవతలి ఒడ్డుకు వచ్చి తండ్రిని ఆ ఒడ్డుకు పంపిస్తాడు. ఈ సారి ఆ ఒడ్డున వున్న కొడుకు ఇవతలికి వస్తాడు. తరువాత ఇద్దరు కొడుకులూ తండ్రిని చేరుకుంటారు. ఇంతేనా!

legs లో లేనిది ఏంటి?

చిక్కుప్రశ్న

నేస్తాలూ...! మీకు ఇంగ్లీషు బాగా వచ్చా? అయినా మేం చాలా చిన్న ప్రశ్నే వేస్తున్నాంలే!! కాకపోతే కాస్త మీ బుర్రకు పదునుపెడితేనే మా ప్రశ్నకు జవాబు దొరుకుతుంది. లేకపోతే పెద్ద తలనొప్పిగా అనిపిస్తుంది. మరేంటో అడగమంటారా?

head లోనూ, hands లోనూ ఒకటుంది. కానీ legs అది లేదు. ఇంతకీ అదేంటి? బాగా ఆలోచించుకోండి. ఎందుకంటే ఏడు రోజుల సమయం వుందిగా. పై వారం సమాధానం చెప్పాక మాత్రం 'ఓస్ ఇంతేనా!' అని మాత్రం చేతులు విదిలిస్తే ఊరుకోం. సరేనా.

గణిత భాష

1.కామాక్షి చక్కని చుక్క. **(, క్షి చక్కని .)**

2.పై అరలో పావురము వున్నది. (P ½లో ¼రము **వున్నది.**)

3. గీత చుక్కల ముగ్గు వేస్తోంది. **(- ...ల ముగ్గు వేస్తోంది.)**

4.కూరలో కొంచెం ఉప్పు వెయ్యి. **(కూరలో కొంచెం ఉప్పు 1000.)**

5.అరటికాయలో అనేక పోషక పదార్థాలుంటాయి. **(½టి కాయలో అనేక పోషక పదార్థాలుంటాయి.)**

రైలు పొగ ఎటు వెళుతుంది?

సరదా లెక్క

హాయ్! ఇవాళ భలే సరదా లెక్క అడగాలనుకుంటున్నాం. దానికి మీరు రెడీనా!ఏంటి అంతా అంత సంతోషంగా 'ఓ య్యస్' అంటున్నారు. అయితే మాదేనన్నమాట ఆలస్యం! సరే అడిగేస్తున్నాం.

ఒక ఎలక్ట్రికట్ ట్రైన్ పడమర నుంచి తూర్పుకి మహా వేగంగా వెళుతోంది. మరి దాని పొగ ఎటువైపు వెళుతుందో చెప్పాలి. వెంటనే. ఇంత సేపు చెయ్యకూడదు. కానీ సరైన సమాధానం ఏంటో వచ్చే వారం చెప్తామే.

వడ్రంగి సింహం

అనగనగా ఒక గ్రామంలో ఒక వడ్రంగి వున్నాడు. అతను ప్రతిదినం అడవికి పోయి కట్టెలు కొట్టుకుని వచ్చేవాడు. ఒకరోజు అతనికి ఒక సింహం ఎదురైంది. దాన్ని చూసి భయంతో వణికిపోయాడు.కాని సింహం అతన్ని చూసి జాలిపడింది "మానవుడా! భయపడకు! నేను నిన్నేమీ చేయను..." అంది.

దాని మాటలు విని వడ్రంగి సంతోషించాడు. తన దగ్గరున్న ఆహారాన్ని దానికి పెట్టాడు. ఆ తర్వాత వడ్రంగికీ, సింహానికీ స్నేహం ఏర్పడింది.

అప్పటి నుండి వడ్రంగి ప్రతి రోజూ సింహానికి మంచి రుచికరమైన పదార్థాలు తెచ్చి పెట్టసాగాడు. వాటిని తిని సింహం తృప్తిగా కాలం గడపసాగింది.

ఆ సింహానికి మంత్రులుగా వున్న కాకి, నక్క ఒక రోజు, "ప్రభూ! మీరు ఈ మధ్య వేటాడటానికి వెళ్లడం లేదు. కారణం ఏమిటి?" అని సింహాన్ని ప్రశ్నించాయి. సింహం వడ్రంగితో ఏర్పడిన స్నేహం గురించి చెప్పింది.

"అయితే ప్రభూ! మీ కొత్త స్నేహితుని చూడాలని మాకు కూడా ఎంతో ఉత్సాహంగా వుంది. దయచేసి మీ మిత్రుడిని మాకు చూపించండి" అని కాకి, నక్క అడిగాయి.

"తప్పకుండా చూపిస్తాను" అని సింహం వాటికి వాగ్దానం చేసింది. సింహం ఆ మరునాడే కాకిని, నక్కను వెంట పెట్టుకుని వడ్రంగిని రోజూ కలుసుకునే ప్రదేశానికి బయలుదేరింది.

సింహం రాక కోసం ఎదురుచూస్తున్న వడ్రంగి, సింహంతోపాటు వస్తున్న నక్కను, కాకిని చూశాడు. వెంటనే పరిగెత్తుకుంటూ పోయి ఒక చెట్టు ఎక్కి కూర్చున్నాడు. వడ్రంగి చెట్టు ఎక్కడం చూసి సింహం ఆశ్చర్యపోయింది. "మిత్రమా! నిన్ను చూడాలని నా మంత్రులు వచ్చారు. కానీ నువ్వు ఈ విధంగా పారిపోయి చెట్టెక్కి కూర్చున్నావేంటి?" అని అడిగింది సింహం.

"మృగరాజా! నువ్వు మంచివాడివే. కానీ నీ వెంట వచ్చిన నీ సహచరులు చెడ్డవాళ్లు. నక్క జిత్తులమారి. కాకిది దొంగబుద్ధి. అటువంటి దుష్టుల వెంట వున్న నీతో స్నేహం చేయడం ప్రమాదకరం. అందుకనే ఇలా చెట్టు ఎక్కాను" అన్నాడు వడ్రంగి. ఆ మాటలు విని సింహం సిగ్గుపడి వెళ్లిపోయింది.

సంజీవకుడు "వడ్రంగి-సింహం" కథ చెప్పి, దుష్టుల సాహచర్యంలో వున్న ఆ సింహంలాగే పింగళకుడు కూడా దుష్టులతో కూడి వున్నాడు. చాడీలు విని నన్ను చంపడానికి సిద్ధమైన పింగళకుని వంటి రాజుకి తలవంచడం కన్నా ధైర్యంతో పోరాడి చావడం మేలు" అన్నాడు.

సంజీవకుని మాటలు విని తన పాచిక పారినందుకు దమనకుడు సంతోషించాడు. "మిత్రమా! సంజీవకా! నీ శత్రువైన పింగళకుడు నీ కన్నా మహా బలవంతుడు. అలాంటి వాడిని ఉపాయంతోనే జయించాలి. పూర్వం ఒక తీతువు పిట్ట ఇదే విధంగా సముద్రుడిని జయించింది. ఆ కథ చెబుతాను విను" అంటూ దమనకుడు చెప్పసాగాడు.

పద ప్రదర్శకురాలు

పొత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ

సాయంత్రం ఆరు గంటలైంది.

కర్నూలు పట్టణంలో జనం రద్దీ పెరిగింది.

ఒక్కొక్కరే చేరుకోవడంతో ఆడిటోరియం నిండింది. ఆ పక్కన హాల్లో ప్రారంభమైన చిత్రకళా ప్రదర్శన జనాన్ని ఆకట్టుకుంటోంది.

రకరకాల చిత్రాలను అందంగా గోడలకు అమర్చారు.

కొండల మధ్య నుంచి ఉదయిస్తున్న సూర్యుడు. అరుణిమను అలముకున్న ఆకాశం... ఆకాశంలో ఎగురుతున్న పక్షుల గుంపు... అందమైన సరస్సు... ఒడ్డున పెద్ద వృక్షం... ఆ వృక్షం నీటిలో ప్రతిఫలిస్తున్న దృశ్యం చూసే వారిని అబ్బుర పరుస్తోంది. మరో చిత్రంలో ఒక పల్లెపడుచు హొయలు ఒలికిస్తూ వయ్యారంగా బిందెతో నీళ్ళు పట్టుకువస్తున్నట్లు... ఒక మాతృమూర్తి తన పసిపాపకు పాలు పడుతున్నట్లు రకరకాల చిత్రాలు ఆకర్షిస్తున్నాయి. వీటితో పాటు గౌతమబుద్ధుడు, శివాజీ, గాంధీజీ, వినాయకుడు, హనుమంతుడు వంటి చిత్రాలుకూడా ఉన్నాయి. ఆడిటోరియంలో గోడలకు టేపుతో అంటించారు.

వచ్చిన వారు గది అంతా కలియతిరుగుతూ బొమ్మలను చూస్తున్నారు. రెండవ ద్వారం వద్ద ఒక అబ్బాయి పెద్ద బైండు పుస్తకం టేబులు పైన పెట్టి పక్కన కుర్చీలో కూర్చున్నాడు.

చిత్రకళా ప్రదర్శన తిలకించిన వారు ఆ పుస్తకంలో తమ అభిప్రాయాలను రాస్తున్నారు. కింద సంతకం చేస్తున్నారు.

చూస్తున్న వారంతా ఆ పుస్తకంలో అభినందనలనే పొందుపరిచారు. కొంతమంది ఆ చిత్రాలు వేసిన వ్యక్తి ఎక్కడ అని వాకబు చేశారు. పిల్లలు అయితే ఆటోగ్రాఫ్ కావాలని అడిగారు.

రాత్రి ఎనిమిది గంటలు...

చిత్రకళా ప్రదర్శన ముగింపు సమావేశం ప్రారంభమైంది. ప్రారంభానికి సూచనగా ప్రార్థనాగీతం ఆలపించారు.

అంతవరకూ చిత్రాలను తిలకించిన వారు ఆ చిత్రాలను చిత్రీకరించిన ఆర్టిస్టును చూడాలని సీట్లలో కూర్చున్నారు.

సమావేశం ప్రారంభమైంది.

వక్తలు ఒక్కొక్కరే ప్రసంగాలు ప్రారంభించారు.

చిత్రకళ పట్ల ప్రస్తుత పరిస్థితుల్లో ఆసక్తి తగ్గిపోతోందని... ప్రదర్శనలు ఏర్పాటు చేయడం కూడా కష్టం అవుతోందని నిర్వాహకులు చెప్పారు. మరో వ్యక్తి ప్రదర్శించిన చిత్రాల్లో గొప్పతనాన్ని వివరించారు.

ఇంతలో వేదిక వద్దకు చక్రాల కుర్చీ వచ్చింది.

అందులో నుంచి ఒక అమ్మాయి దిగింది. నెమ్మదిగా వేదికను ఎక్కి పక్కనున్న కుర్చీ పైకి ఎక్కి అతి కష్టంపై కూర్చుంది. నిర్వాహకులు ఆమె వైపు చూపిస్తూ – "మీరు చూసిన చిత్రాలను, బొమ్మలను వేసింది ఈ అమ్మాయే" అని పరిచయం చేశారు.

శ్రోతలు చప్పట్లు చరిచారు.

ఆనందంతో నాగమణి లేచి నిలబడబోయింది. కాని బలహీనంగా ఉన్న కాళ్ళు సహకరించక ఆ ప్రయత్నాన్ని విరమించి రెండు చేతులు ఎత్తి నమస్కరించబోయింది. వ్రేల్లాడుతున్న చేతులు సహకరించలేదు.

అప్రయత్నంగా తలపంకించింది.

ప్రేక్షకులు మరోసారి హర్షధ్వానాలు చేశారు.

వారి అభిమానానికి నాగమణికి కన్నీళ్ళు వచ్చాయి. రుమాలుతో తుడుచుకునే అవకాశం లేకపోయింది. అవి చెక్కిళ్లపై జాలువారాయి.

"నాగమణి అరుదైన చిత్రకారిణి... చేతులు లేకపోయినా కాళ్ళతో అన్ని పనులు చేయగల సమర్థురాలు...నిరాశతో కుంగిపోకుండా చిత్రకళను అభ్యాసం చేసింది. కాళ్ళతో చిత్రాలను అద్భుతంగా గీయడం నేర్చుకుంది. ఎంతోమంది చేతులతో కూడా గీయలేని చిత్రాలను ఈమె కాళ్ళతో చిత్రీకరించింది. ఇటువంటి ఆర్టిస్టులను ప్రోత్సహించవలసిన అవసరం ఉంది!" కార్యక్రమ నిర్వాహకులు ఉపన్యాసంలో వివరించారు.

తర్వాత చాలా మంది ఆమె చిత్రకళను మెచ్చుకున్నారు.

కొంతమంది ఆటోగ్రాఫ్‌ల కోసం వస్తే వారి పుస్తకాలపై కాళ్ళతో సంతకాలు చేసింది.

తాను గీసిన చిత్రాలతో చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేయాలన్న నాగమణి చిరకాల వాంఛ తీరడంతో ఆమె ఎంతో సంతృప్తి చెందింది.

అంతా అయిపోయిన తర్వాత నాగమణి తమ్ముడు గోపి అన్ని చిత్రాలను సేకరించి చిరిగిపోకుండా భద్రంగా కట్టలుగా కట్టాడు.

తర్వాత ఆటోలో ఇంటికి వెళ్ళిపోయారు.

* * *

కర్నూలులో కె.ప్రభాకరరావు, సువర్ణమ్మలకు అయిదుగురు పిల్లలు. వీరిలో నాగమణి నాలుగవ సంతానం. పుట్టకతోనే రెండు చేతులు లేవు. పెద్దయిన తర్వాత క్రమంగా చేతులు పెరుగుతాయని తల్లిదండ్రులు ఆశించారు. అన్ని అవయవాలు ఎదిగినప్పటికీ చేతులు మాత్రం వంకర్లు

తిరిగిపోవడంతో ఏ పనీ చేయడానికి అవకాశం లేకపోయింది.

వయసు పెరిగే కొద్ది తన ఈడు పిల్లలంతా పాఠశాలలకు వెళుతుంటే తాను చదవలేకపోతున్నాననే బాధ నాగమణిలో పెరిగిపోయేది. ఆమె బాధను గుర్తించి తల్లిదండ్రులు కాళ్ళతో రాసే విధానాన్ని తెలియజేశారు. ఎంతో కష్టం అనిపించినప్పటికీ కాళ్ళతో రాయడం ప్రాక్టీసు చేసింది.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కర్నూలులో ప్రైవేటు కాన్వెంటులో చేర్పించారు. అందరూ చేతులతో రాస్తే నాగమణి కాళ్ళతోరాస్తూ ఒకో పరీక్షా దాటుకుంటే పదవ తరగతి ఉత్తీర్ణత సాధించింది. ఆమె కృషిని ఇరుగుపొరుగు వారు, ఉపాధ్యాయులు, బంధుమిత్రులు అందరూ అభినందించారు.

ఆ సమయంలో తండ్రిని కోల్పోయింది.

అయినా ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు.

పెద్దన్నయ్య అండదండలతో ఇంటర్మీడియెట్ పూర్తి చేసింది.

ఆ తర్వాత వచ్చిన ఆలోచన నాగమణి జీవితంలో మలుపు తిప్పింది. ఇంటర్ తర్వాత ఏ కోర్సు చేయాలా అని ఆలోచిస్తుండగా డ్రాయింగు నేర్చుకోమని ఎవరో సలహా ఇచ్చారు.

చిత్రలేఖనం కోర్సులో చేరింది.

అప్పటికే కొంత ఆసక్తి ఉన్న రంగం కావడంతో మరింత ఉత్సాహంగా చిత్రాలు వేయడం నేర్చుకుంది. పెన్సిల్‌తో బొమ్మలు వేసి దానిని రంగులతో దిద్దేది. క్రమంగా బ్రష్ పట్టుకుని నేరుగా బొమ్మలు వేయడం నేర్చుకుంది.

ఏదైనా చిత్రం వేయాలంటే ముందు తన మనోఫలకంపై ఆ చిత్రాన్ని ఊహించుకుని చకచకా గీస్తుంది. అది అందమైన చిత్రంగా రూపొందుతుంది.

డ్రాయింగ్ టీచర్ ట్రయినింగ్ పరీక్షలో నాగమణి ఉత్తీర్ణత సాధించింది. తర్వాత అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ కూడా పూర్తి చేసింది.

రకరకాల చిత్రాలు గీయడంలో కృషి ప్రారంభించింది.

* * *

చిత్రకళా పాఠశాల.

ఊరికి దూరంగా కాలనీలో రేకుల షెడ్డులో దానిని నిర్వహిస్తున్నారు. ఇంటిముందు డ్రాయింగు స్కూలు పేరుతో బోర్డు ఉంది.

వివిధ పాఠశాలలకు చెందిన బాలబాలికలు ఆ పాఠశాలలో చదువుతున్నారు. ఉదయం రెండు గంటలు సాయంత్రం రెండు గంటల పాటు పాఠశాల నడుస్తుంది.

బొమ్మలు ఎలా వేయాలి.... వేసిన బొమ్మలకు రంగులు ఎలా అద్దాలి... ఫొటోలను చూస్తూ బొమ్మలు గీయడం ఎలా అన్న విషయాలను అక్కడ బోధ పరుస్తుంటారు.

ఉదయం పూట థియరీ క్లాసులు, సాయంత్రం ప్రాక్టికల్ క్లాసులు ఉంటాయి. ఆదివారం సెలవు వున్నప్పటికీ ప్రత్యేక క్లాసులు కూడా తరచూ నిర్వహిస్తారు.

బోధనలో చిత్తశుద్ధి... వివిధ అంశాలను నేర్పించడంలో క్రమశిక్షణ ఆ పాఠశాలకు మంచిపేరును తీసుకువచ్చాయి. ఆ పరిసర ప్రాంతాల్లో ఎంతోమంది తమ పిల్లల్ని ఆ పాఠశాలలో చేర్పించారు.

రెగ్యులర్ విద్యార్థులకే కాకుండా సంక్రాంతి, దసరా, వేసవి సెలవులు వంటి ప్రత్యేక సందర్భాలలో కూడా ఆ పాఠశాలలో స్పెషల్ స్వల్పకాలిక కోర్సులను నిర్వహిస్తుంటారు.

ఆ రోజు సోమవారం.

ఉదయం నుంచే సన్నగా వర్షం మొదలైంది.

తరగతికి రావలసిన విద్యార్థులందరూ హాజరయ్యారు. థియరీ క్లాసు ప్రారంభమైంది. బొమ్మలు గీసే సమయంలో ఏ ఏ అంశాలకు ఎంతెంత స్థలం వదిలి పెట్టాలి.... ఎలా గ్రాఫ్ ద్వారా బొమ్మలు గీయాలి అన్న విషయాలను వివరిస్తున్నారు.

కురుస్తున్న వర్షం విద్యార్థులకు ఇబ్బందిగా ఉంది. ఏకాగ్రత కుదరడం లేదు.

అయినప్పటికీ తరగతి కొనసాగుతోంది.

విద్యార్థులు తమకు అవసరమైన విషయాలను పుస్తకంలో రాసుకుంటున్నారు. గుర్తుంచుకోవలసిన అంశాల కింద గీతలు గీసుకుంటున్నారు.

వర్షం కురుస్తూనే ఉంది.

"టీచర్! అమ్మాయి బొమ్మ వేయడానికి చేయి తిరగడం లేదు. ఎలా వేద్దామన్నా ఆకారంరావడం లేదు. మీరు చెప్పిన గ్రాఫ్ ద్వారా కూడా కుదరడం లేదు-" సాయి పాంచజన్య అనే విద్యార్థి చెప్పాడు.

"మనం గీయాలనుకున్న బొమ్మ ఏ విధంగా ఉండాలో మనసులో అనుకోవాలి... ఆ బొమ్మ చూసే వారికి ఎంతదూరంలో ఉందో తెలుసుకొనేలా చిత్రీకరించాలి. ఎదురుగా అయితే ఒకలా ఉండాలి. దూరంగా అయితే మరోలా గీయాలి...." టీచర్ వివరించాడు.

తర్వాత పిల్లలు ఒక్కొక్క సందేహాన్ని అడుగుతుంటే ఓపిగ్గా నివృత్తి చేసింది.

''బొమ్మలు గురించి చెప్పిన విషయాలు అర్థమవుతాయి. కానీ గీయడం కష్టంగా ఉంటుంది. అయినా ప్రాక్టీసు చేయాలి..." అంటూ స్కూలు ప్రిన్సిపాల్ నాగమణి కాళ్ళతో ఆ చిత్రాన్ని గీసి చూపించింది.

ఆమె గీసే విధానాన్ని విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.

బైట వర్షం కురుస్తూనే ఉంది. ★

సమస్య

(9వ పేజీ తరువాయి)

కాకపోయినా కష్టానికీ సుఖానికీ ఆ ఇంట్లో కలిసిపోయింది. అందరూ బయలుదేరే సన్నాహంలో వుండటం కనిపెట్టి వచ్చింది. తండ్రికి కనకరత్నం అంటే వల్లమాలిన అభిమానం అని అందరికీ తెలుసు. కొడుకులు దగ్గర లేనప్పుడు కష్టం వస్తే చూసేది. కబుర్లు చేసి రప్పించేది.

మీరు కట్నాలు పోసి పెళ్ళి చేసుకున్నారు గనక, తల్లి బంగారం పంచుకున్నారు గనక ఇక ఆస్తిలో వాటా అడక్కండి-అన్నది కనకరత్నం.

ఆవిడ మీద గయ్యిమన్నారు కూతుళ్ళు.

"అన్నీ తెలిసిన దానివి, కాస్త ఇల్లు చూస్తూ వుండు. ఏదన్నా బేరం వస్తే కబురు చెయ్యి" అన్నది పెద్దకోడలు, పెద్దవాడు ఆదినారాయణ భార్య.

"ఏ మాటా తెగలేదన్నమాట" అన్నది కనకరత్నం.

"అమ్మా నాన్న సంవత్సరీకాలు అయ్యాక, అప్పుడమ్ముతారట. అప్పటికైనా అమ్ముతారో లేదో - ఈలోగా ఇంటి అద్దెలు-"

"ఒక్కపైసా ముట్టుకోం. బ్యాంకులో వేసి వుంచుతాం. అవసరాన్ని బట్టి ఇంటికిందే ఖర్చు చేస్తాం" అన్నాడు పెద్దవాడు.

వెలుతురు తగ్గింది. దోమలు గుయ్యిమంటున్నాయి. అంతా ఇవతలికొచ్చారు. తాళాలు వేశారు. అద్దెకున్న వాళ్ళు ఇవతలికొచ్చారు. వాళ్ళతో చెప్పారు ఆడవాళ్ళు. కొబ్బరిచెట్ల నిండా కాయలున్నాయి. మామిడిచెట్టు మంచి పూత మీద వున్నది. వదిలి వెళ్ళడానికి కష్టంగా వుంది. కాని ఏం చెయ్యడానికీ లేదు.

అంతా గేటుదాటి రోడ్డు మీదకొచ్చి ఒక్కసారి ఇంటివేపు చూశారు. గుండె గుభేలు మంది అంత పెద్ద ఇల్లు ఇలా వదిలేసి వెళ్ళిపోవడమే!? జబ్బు చేసిన తల్లినీ, తండ్రినీ వదిలేసి వెళ్ళిపోతున్నప్పుడు కూడా వెయ్యనంత బాధవేసింది. ★

ఎంతదూరమో... అంత దగ్గిర...

లక్ష్మి

దేవుడున్నాడా లేడా అనే విషయమ్మీద నేను చర్చించదలుచుకోలేదు!

ఉన్నాడనుకున్న వాళ్ళకి వున్నాడు – లేనివాళ్ళకి లేడు! వదిలేయండి!

ఉన్నాడున్నాడని ప్రకటనలు చేసే పరమ భక్తులకు సైతం – ఆ స్వామి వారి గుడి దూరంగా వుంటేనే గురీ గౌరవాలు పెరుగుతాయి!

మంచీమర్యాదలు పెరుగుతాయి!

దూరంగా వుండే స్వామి మీద భక్తులకు భక్తి పెరుగుతుంది. స్వామి వారి దర్శన భాగ్యమ్మీద ఆరాటం పెరుగుతుంది!

అందుకు వేడికోళ్ళు పెరుగుతాయి!

స్వామివారి కరుణాకటాక్షం కొరకు దీక్ష వహిస్తారు. పూజలూ భజనలూ పెరుగుతాయి!

చివరికి –

ఆ దేవుడేం చేస్తాడో గాని –

ఈలోగా భక్త శిఖామణులని పిలిపించుకుంటాం!

మహామునులు సైతం –

ఈ గొడవతోనే ముక్తి పొందేరని ఆస్తికులు చెబుతుంటారు!

అందుబాటులో లేని ఆ దేవుడి సాక్షాత్కారం కోసం మునులు అడవులూ కొండలూ దాటేసి వెళ్ళిపోయేరుట!

ఎండావానని పట్టించుకోలేదు. చలి బాధని లెక్క చేయలేదు. ఈతి బాధలకతీతంగా ముక్కు మూసుకుని ఘోర తపస్సు చేసి – కొన్నేళ్ళ తర్వాత ఫలసిద్ధి పొంది తరించేరుట!

ఇదంతా –

ఆ పై వాడు అందుబాటులో లేని కారణంగా జరిగిన తంతు!

పిలిస్తే ప్రత్యక్షమయ్యే స్వామికోసం ఇంత ఆర్భాటం జరగదు!

అందుకే అంటారు – ఊళ్ళో వున్న దేవుడి మీద ఊరివాళ్ళకి నిర్లక్ష్యమని! మా దేవుడేగా అని ఆ దేవుడ్ని తేలిగ్గా చూస్తారు!

అదే దేవుడ్ని చూసేందుకు పొరుగూరి భక్తులు ఎక్కడెక్కడ్నించో ఆరాటంతో వస్తుంటే – అమాయకులు పాపం అనుకుంటారు ఆ ఊరివాళ్ళు!

ఆ ఊళ్ళో దేవుడ్ని చూసేందుకు వస్తున్న పొరుగూరి వాళ్ళ ఆరాటంలో ఆవగింజంతైనా ఆ ఊరివాళ్ళకుండదు!

తీరుబడైనప్పుడు చూడొచ్చునని స్వామిదర్శనానికి వాయిదాలేస్తుంటారు. మన ఊరి దేవుడు మనల్ని ఆదుకోకుండా ఎవర్నాదుకుంటాడనే పిడివాదంతో ఆ గుడి ఛాయలకే వెళ్ళరు!

నట్టింట స్వామి వారున్నట్టు గొప్ప ధీమాగా వుంటారు!

గుడిని విడిచిపెట్టండి. ఏడు జిల్లాలకు ఏకైక అధికారి మనకి దగ్గిర బంధువైనప్పుడు కూడా ఈ తంతు ఇట్లాగే జరుగుతుంది!

సదరు అధికారి ఆఫీసులో ఎంత ఛండశాసనుడైనా – సొంత ఇంటో పవరు లేని మనిషల్లె పడి వుంటాడు. కన్న బిడ్డల ముందూ, కట్టుకున్న భార్యముందూ ఆ పెద్దమనిషి అధికారం చెల్లుబడి కాదు!

శ్రీవారిని చూస్తే బయట ప్రపంచం చేతులు జోడించవచ్చు. సొంత ఇంటో కూడా అదే కార్యక్రమం నడవాలంటే వీలు కాదు!

ఆ పెద్దమనిషి –

సొంతమనుషులకు దగ్గిరవడం వల్ల ఆ ఛాన్సు పోతుంది!

అంచేత –

ఎంతోకొంత దూరంగా వుంటేనే గౌరవం!

తాయారమ్మ గారిదీ మీదీ ఒకే ఊరు. బంటుమిల్లి. ఆ ఊళ్ళో మీకు తాయారమ్మ కనిపించినా, తాయారమ్మకు మీరు కనిపించినా – చూసీ చూడనట్టు వ్యవహరిస్తారు!

అల్లాంటిది –

సప్తసముద్రాలవతల స్విట్జర్లాండులో మీరిద్దరూ కలుసుకుంటే కావిలించుకుని గొల్లున ఏడ్చే అకాశమెంతైనా వుంటుంది!

అంతేగదా!

సొంత ఊరికి ఎంతో దూరంలో ఒకర్నొకరు కలుసుకున్నప్పుడు కలిగే థ్రిల్లు – కన్నీటి లెవల్లోనే వుంటుంది.

ఎంత స్విట్జర్లాండయినా –

కావిలించుకోడాలూ కన్నీరెట్టుకోడాలూ ఒకటీ రెండ్రోజులే! ఆ తర్వాత రొటీన్లో పడిపోతే అంత గొప్ప స్విట్జర్లాండు కూడా ఆఫ్టరాల్ బంటుమిల్లే అయిపోతుంది!

అత్తమామలకు దూరంగా కాపరం పెట్టిన కోడలు పిల్లకు – సదరు అత్తమామలు పార్వతీ పరమేశ్వరుల్లాగా కనిపిస్తారు!

మీ ఆరోగ్యం జాగర్తంటూ భర్త చేత రోజుకోఉత్తరం రాయిస్తుంది. అది చాలదన్నట్టు – రోజు విడిచి రోజు ఫోన్లు చేస్తుంటుంది!

వాళ్ళ ఫొటోలు గోడక్కొట్టించి కళ్ళకద్దుకుంటుంది!

ఎంతచేత!

వాళ్ళు దూరంగా వున్నారు గనక!

అదే అత్తమామలు సొంత ఊళ్ళో కేంపు ఎత్తేసి కోడలి దగ్గిరికొచ్చి సెటిలైతే – మొదట్లో ఆ పిల్లచేత పాదాభివందనాలు గొప్ప ఘనంగానే సాగుతాయి!

తర్వాత్తర్వాత ఆ ఇల్లు నరకమవుతుంది!

నువ్వెంతంటె నువ్వెంతని అత్తాకోడళ్ళు నోరు పారేసుకుంటారు. రోజుకో సమస్య. రోజుకో యుద్ధం!

ఎంచేత?

వాళ్ళు దగ్గరగా వున్నారు గనక!

ఏడాదికో తడవ చుట్టం చూపుగా వెళ్ళే అతిథి దేవుళ్ళకు విలువెక్కువ. వెళ్ళిన ప్రతిసారీ ఒకటీ రెండ్రోజులకంటే ఎక్కువ కాలం మకాం పెట్టకుండా జాగర్తపడితే – అటు గెస్టుకీ ఇటు హోస్టుకీ మర్యాదగా వుంటుంది!

అట్లాగాకుండా –

తరచూ దర్శనమిస్తూ, దర్శనమిచ్చిన ప్రతి తడవా నాలుగైదు రోజులు మకాం పెడుతుంటే – ఛీ పొమ్మనే ప్రమాదం తథ్యము సుమతీ అవుతుంది!

అంచేత –

దూరదూరంగా వుంటూ మర్యాద కాపాడుకోడమే బెటరని స్వాభిప్రాయం! ★

"బామ్మర్దీ... మనవాళ్ళుత్త వెధవలని తేలిపోయింది" పచ్చబాబుగారు మహాకసిగా - కుసింత విచారంగా అన్నాడు. సోమయ్యకు ఆ 'కసి' ఎందుకో దాని వెనకాతలే ఆ "విచారం" ఎందుకో ఎంత గింజుకున్నా తట్టలేదు. కాబట్టి - తప్పదుగదా అని 'అవునవును బావా' అని ఓ వంతపాట పాడాడు. బాబుగారి భార్య గారు మాత్రం మటమటలాడుతూ మెటికలు విరిచి లోనికి దయ చేసింది.

అబ్బో ఓ అభివృద్ధి

రుక్మిణి

"బామ్మర్దీ! మన వాళ్ళుత్త వెధవలెందుకో నువ్వు చెప్పకుండానే 'చిత్తం - చిత్తం' అంటున్నావు - 'చెత్త'వలిచేస్తా!" బాబుగారు గర్జించడంతో సోమయ్య నిజంగానే హడలిపోయాడు. నట్టాలు మీద బుద్ధిమంతుడిలా కూలబడి బావగారికేసి బేలగా చూశాడు. బాబుగారికి జాలేసింది. "అది కాదురా బామ్మర్దీ - మన జనాలకు 'అభివృద్ధి' అంటే ఏంటో తెలవదు - ఏమంటావు"

'చిత్తం బావా... చిత్తం' సోమయ్య వంతకు తగులుకున్నాడు. బాబుగారు రెచ్చిపోయారు. "అరె గత తొమ్మిది సంవత్సరాల నుండీ 'మనం' ఇంత 'అభివృద్ధి' చేశాం గదా - 'బ్రహ్మపదార్థం' ఎట్లా ఏడుస్తుందో తెలవదని రకరకాలుగా బుర్ర కథలు చెప్పి ప్రచారం చేశాం గదా... ప్చ్... ఎవడికీ అది ఎక్కలేదు... అర్థం కాలేదు... ఖర్మ... ఖర్మ...!

"సరిసరి... అర్థం కాలేదు గనకనే ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించి పారేశారు!" తలుపు చాటు నుండి భార్యామణి మళ్ళా మెటికలు విరిచింది.

"నోర్ముయ్... ఈ రాష్ట్రాన్ని అప్పులతో అభివృద్ధిలో నడిపించింది మేము - హవ్వ! ఎన్ని రోడ్లు... ఎన్ని ఇంకుడు గుంతలు... ప్రపంచంలో ఇన్ని చెక్‌డ్యాంలు కట్టించిన మొనగాడెవడు - ఇదంతా "అభివృద్ధి" కాదా! రోజుకు పద్దెనిమిది గంటలు హెలికాప్టరులో ఏకధాటిగా తిరిగింది అభివృద్ధి కాదా - ఛ... ఛ... అభివృద్ధి అంటే తెలవని మూర్ఖులు... విశ్వాసం లేని జనాలే.

బాబుగారు బాధ నుండి విషాదంలోకి జారుకున్నాడు. సోమయ్య మనసు కరిగిపోయింది. కడుపు తరుక్కుపోయింది.

"పోనీలే బావా - అసలు ఎలక్షన్లలో 'అభివృద్ధి' అని ప్రచారం చేయడమే మన కొంపముంచింది...!

"మరి ఏం ప్రచారం చేస్తే బాగుండేదిరా బద్మాష్!" బాబుగారు అరిచారు. సోమయ్య ఓదార్పుడు... చూడు బావా... మనం జనాలకు ఆశలు కల్పించాం. కానీ అవి పనికి రాని ఆశలు... 'మద్యం' పారించాం. దాని మత్తు దిగంగానే అంతా తుస్సు - అసలు బావా... మనం రైతుల గురించి బాగా పట్టించుకుని వుంటే బాగుండేది - ప్రతి రైతుకూ రెండు పాయింట్లు - మూడు బుష్ కోట్లు - జత బూట్లూ ఇస్తామని బాగా ప్రచారం చేయాల్సుండె...

"ఇంకా...!! బాబుగారు ఆశగా అడిగారు - "ఆడపోరగాండ్లకు సైకిళ్ళు ఇచ్చినట్లు మగ పోరగాండ్లకు మోటారు సైకిళ్ళూ తలమీద హెల్మెట్లూ ఇస్తామంటే అదే అభివృద్ధి...

"ఇంకా?" బాబుగారు ఆత్రంగా అడిగారు.

"అసలు ఊర్లలో కరంటనేది లేకుండా పూరాగా బందుచేసి తలా ఒక డబ్బాడు ఆముదం - రెండు ప్రమిదలు... దీపాలు...

"సోముగా, బామ్మర్దీ..." బాబుగారు చాలా కసిగా అరిచాడు. "అభివృద్ధి అంటే ఇదేనా... ఇంతేనా...!" కుర్చీ మీద నుండి అంతెత్తున ఎగురుతూ బాబుగారు అరుపులకు తగులుకున్నాడు - ఈ దెబ్బకు వారి భార్యగారు రంగ ప్రవేశం చేసి ఒక హుంకరింపు చేసేసరికి బాబుగారు కూలబడ్డాడు. నిట్టూర్చాడు. తలపట్టుకున్నాడు.

"ఏందీ... జనాలకు 'అభివృద్ధి' అర్థం కాలేదా.. ఏమయ్యా.. మోయలేని గ్యాసుబండలు అభివృద్ధా.... పెంచిన కరంటు ఛార్జీలు అభివృద్ధా... రోజుకో మాయ మాట... "మాయ పథకం" ప్రకటించ డం అభివృద్ధా - తాగడానికి నీళ్ళు దొరక్కపోతే మినరల్ వాటర్ అమ్మకాలు పెట్టడం అభివృద్ధా.. దళారీ కాంట్రాక్టుల జేబులు నింపడం అభివృద్ధా.... 'పనికి ఆహార బియ్యం" లారీల కొద్దీ మిల్లులకు తరలించడం అభివృద్ధా....

బాబుగారు ఒళ్ళంతా కంపించి పోయి జుట్టు పీక్కుంటున్నారు - సోమయ్య ఇదేదో ప్రమాదకరమైన రంగం అని చల్లగా జారుకున్నాడు - సరిసరి...!

"అభివృద్ధి" అంటే ఏంటో ముందు మీరు తెలుసుకోండి - అది తెలవకుండా దాని గురించి వాగితే ప్రజలు తగిన బుద్ధి చెప్తారు...

ఈ పాటికే బాబుగారు మూర్ఛలోకి జారుకున్నాడు. ★

ఆరోగ్యం మెరుగుపరచుకోవాలంటే...



సాధ్యమైన మేరకు ఆరోగ్యాన్ని కాపాడుకోవటం మన పనిలో ఒక భాగం. శరీరం ఆరోగ్యంగా వుంటే మానసికంగా ఆలోచనలు ఆరోగ్యంగా వుంటాయి. పని ఎంతైనా చేయటానికి అవకాశం వుంటుంది. ఆరోగ్యకర పద్ధతులు పాటించటానికి కొన్నిసార్లు సిగ్గు పడుతుంటాం. శాస్త్ర ప్రకారం పాటించిన వాళ్ళకు ఎంతమందికి ఎన్ని జబ్బులు రాలేదూ అనుకుంటూ భావవాద ధోరణిలో సెంటిమెంటల్‌గా ఆలోచిస్తాం. సాధ్యమైన మేరకు ఆరోగ్యకర పద్ధతులను పాటించటం క్రమశిక్షణ అవుతుంది. కొద్దిపాటి శ్రద్ధతో ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చు. ఆరోగ్యమనే మహాభాగ్యాన్ని పొందవచ్చు.

1. ఆహారపు అలవాట్లు : రోజూ తీసుకునే ఆహారంలో ఉదయం ఎక్కువ భాగం, మధ్యాహ్నం కొంచెం తక్కువగానూ, రాత్రికి ఇంకా తక్కువగానూ తీసుకోవాలి. కారణం ఉదయం నుండి పనిలో వుండే సమయం ఎక్కువగా వుండటం వలన ఆహారం అరుగుదలకు ఎక్కువ సమయం వుంటుంది. మధ్యాహ్నం తీసుకునే ఆహారం అరుగుదలకు సమయం కొంచెం తక్కువగానూ, రాత్రి తీసుకునే ఆహారానికి బాగా తక్కువ సమయం వుంటుంది. ఈ పద్ధతిలో మన శరీరంలోని అరుగుదల వ్యవస్థ పైన భారం పడకుండా వుంటుంది. తిన్న పదార్థం బాగా అరుగుదలతో సమపాళ్ళలో ఒంటికి పడుతుంది. అరుగుదలకు సమయం చాలక తీసుకునే ఆహారంలోని కొవ్వు పదార్థాలు పూర్తిగా అరగక శరీరంలోని కొన్ని భాగాల్లో చేరి లావుగా, స్థూలకాయం ఏర్పడటానికి కారణమవుతుంది.

ఆహారం భుజించేటప్పుడు నెమ్మదిగా బాగా నమిలి మింగటం అవసరం. కారణం అరుగుదలకు దోహదపడే ఎంజైమ్స్ నోటి నుండే తయారవటం మొదలవుతుంది. కనుక నెమ్మదిగా బాగా నమిలి తినటం వల్ల ఆహారం బాగా అరుగుతుంది. ఆహారంలో ఉప్పు, కారం, పులుపు వీలైనంత తక్కువగా తీసుకోవటం మంచిది. ఉప్పు వీలైనంత తక్కువ వాడటం మరీ మంచిది. 40 సంవత్సరాలు దాటిన వారు ఉప్పు తక్కువ వాడటం ఇంకా అవసరం. ఉప్పు ఎక్కువైన కారణంగా బి.పి. పెరుగుదలకు, ఎముకల అరుగుదలకు దారితీసే అవకాశం ఉంది.

కూరగాయలు పచ్చివి (సలాడ్) వీలైనంత ఎక్కువగా ఆహారంలో తీసుకోవటం మంచిది. దానివలన విటమిన్లు ఎక్కువగా సమకూరతాయి. ఉడికిన తరువాత తినటం వలన విటమిన్లు తగ్గిపోతాయి. అంతేగాక పచ్చివి తినటం వలన పీచు పదార్థం అరుగుదలకు బాగా దోహదపడుతుంది. పచ్చివి ఎక్కువగా తినటం వలన నూనె, మసాలాలతో కూడిన పదార్థాలను ఆహారంలో సహజంగానే తక్కువగా తినటం జరుగుతుంది. ఉదా: కీర, దోసకాయ, బీరకాయ, టమాటో, క్యారెట్, బీట్‌రూట్, దొండకాయ మొదలగునవి అందుబాటులో వుంచుకొని ఆకలైనపుడు గాని, భోజనం చేసేటప్పుడు గాని తినే అలవాటు చేసుకోవటం ఆరోగ్యకరం.

మితాహారం, క్రమం తప్పకుండా రోజూ సాధ్యమైనంత వరకూ సమయం పాటించడం, సాధ్యమైన మేరకు అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు, పప్పులు మొదలగునవి తినటం వలన అన్ని రకాల విటమిన్లు లభిస్తాయి. ఒకేసారి ఎక్కువగా కాకుండా కొద్దికొద్దిగా ఎక్కువసార్లు తీసుకోవటం మంచిది. ఎసిడిటీ కూడా రాకుండా వుంటుంది.

ఉదయం, మధ్యాహ్నం, రాత్రిపూట ఆహారం తీసుకునే వేళలు సాధ్యమైన మేరకు క్రమం తప్పకుండా వుంటే ముందుగానే కొంత అరుగుదల అయి తేలికగా వుంటుంది. ఉదయం పూట మలవిసర్జన సాఫీగా వుంటుంది. ఆహారం తీసుకున్న వెంటనే కూర్చోవటం, లేదా పడుకోవటం మంచిది కాదు. తిన్న తరువాత వెంటనే 10 నుండి 15 నిమిషాలు నడవటం అవసరం.

పీచున్న ఆహార పదార్థాలు : ఆడించిన గోధుమపిండి, ముడి బియ్యం, పెసలు, శనగలు, గోధుమలు, నువ్వులు, ఖర్జూరం, కొబ్బరి, ఆకుకూరలు, కాయకూరలు, అన్ని రకాల పండ్లు, ఇలా సహజమైన ఆహారాలన్నింటిలోనూ పీచు పదార్థం వుంటుంది.

పీచున్న పదార్థాలను ఎందుకు తినాలి ? : మనం తిన్న ఆహారం పొట్ట, చిన్నప్రేవులలో ముందుగా అరుగుతుంది. అక్కడ పదార్థంలోని సారమంతా పీల్చుకోగా పీచు మిగులుతుంది. ఆ పీచు ప్రేవులలో వున్న నీటితో వుబ్బుతుంది. అక్కడ నుండి మెల్లగా జరుగుతూ ప్రేవులను శుద్ధి చేసుకుంటూ ప్రేవులలో మిగిలిపోయిన ఆహార పదార్థాలను, చనిపోయిన కణాలను, పనికిరాని జిగురు పదార్థాలను, అపకారం చేసే బాక్టీరియాలను నెట్టుకుంటూ పెద్ద ప్రేవుల ద్వారా మలాశయాన్ని చేరుతుంది.

2. కొందరి ఇండ్లలో కొన్ని రకాల కూరగాయలనే ఎప్పుడూ వాడటం జరుగుతుంది. ఇది మంచి పద్ధతి గాదు. అన్ని విటమిన్లు లభించవు. అన్ని రకాల కూరగాయలను రోజువారీ వాడాలి.

ఎ) ఆరోగ్యానికి ఎక్కువగా అవసరమైన ఆకుకూరలు, సమయానుకూలంగా దొరికే పండ్లు చౌకగానే లభిస్తాయి. పండ్ల విషయంలోనూ మనకు కొన్ని సెంటిమెంట్స్ వుంటాయి. ఉదా : ఖరీదైన యాపిల్ పండుకంటె జామకాయ, అరటిపండు, సీతాఫలం, కమలాపండ్లలోనే పోషకపదార్థాలు ఎక్కువగా వుంటాయి.

బి) కాలీఫ్లవర్, క్యాబేజి కూరలతో పోల్చితే చౌకగా దొరికే తక్కిన ఆకుకూరలు, ఇతర కూరగాయలలోనే విటమిన్లు, మాంసకృత్తులు ఎక్కువగా వుంటాయి.

3. రోజువారి ఆహారంలో వుండాల్సిన పదార్థాలు : పిండిపదార్థాలు, మాంసకృత్తులు, కొవ్వు పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు.

పిండిపదార్థాలు : శరీరానికి శక్తిని, తగిన సత్తువను కలగచేస్తాయి. ఇవి పుష్కలంగా ఆహారం – గోధుమలు, బియ్యం, జొన్న, రాగి లాంటి ధాన్యాల్లో, బంగాళాదుంప, చిలకడదుంప, కర్రపెండలం వంటి దుంపల్లో, అరటిపండు, బెల్లం, చక్కెర మొదలగు వాటిల్లో ఎక్కువగా లభిస్తాయి.

మాంసకృత్తులు : శరీరం ఎదగటానికి, కండరాలు తయారు కావటానికి, మెదడు చురుకుగా పనిచేయటానికి తోడ్పడతాయి. జీవప్రక్రియలో అత్యవసరమైన ఎంజైములు, యాంటీబాడీస్ తయారు చేయటానికి ఉపయోగపడ్తాయి. పప్పులు, చిక్కుళ్ళు, బఠాణీలు, సోయాబీన్స్, వేరుశనగ, పాలు, కాయధాన్యాలు, పెరుగు, గుడ్లు, మాంసం, చేపలలో ఎక్కువవుంటాయి.

కొవ్వుపదార్థాలు : శరీర శ్రమ చేసేప్పుడు కొవ్వు పదార్థాలను మన శరీరం చక్కెరగా మార్చి శక్తినిస్తుంది. శరీరంలో కణ నిర్మాణానికి ఉపయోగపడుతుంది. శరీరానికి కొవ్వు పదార్థాల అవసరం పరిమితం. తక్కువ శాతంలో తీసుకోవటం ఆరోగ్యానికి మంచిది. కొలెస్టరాల్ ఎక్కువయితే రక్తనాళాల్లో చేరి అట్టలు కట్టి వుంటుంది. పప్పులు, నూనెలు, నెయ్యి, వెన్న, మాంసం, జీడిపప్పు, పాలు, గుడ్డు, మీగడ, చేప, పల్లీలు, ఆవాలు, కొబ్బరి కాయలలో ఎక్కువగా వుంటాయి. ఆకుకూరలు, కాయగూరలు, పళ్ళను ఎక్కువగా భుజించటం, ఒళ్ళు వంచి పని చేయటం కొలెస్టరాల్ విరుగుడుకు మార్గాలు.

విటమిన్లు : ఆహారం జీర్ణమవటానికి, రసాయనిక మార్పులు చెందటానికి ఎంజైములు కావాలి. ఎంజైములు

సక్రమంగా పని చేయటానికి, మన ఆరోగ్యానికే గాక శరీరం బాగా పని చేయటానికి విటమిన్లు తోడ్పడతాయి. బొప్పాయి, నారింజ, నిమ్మ, మామిడి మొదలగు పళ్ళు, మాంసం, గుడ్లు, చేప, పాలు, వెన్న, లివరు, పాలకూర, పొన్నగంటి, మెంతి, గోంగూర, చుక్కకూర, కాయకూరలు, టమాటో, క్యాబేజి, నూనెలు మొదలగు వాటిలో లభ్యమవుతాయి.

ఖనిజలవణాలు : వీటివలన రక్తం, ఎముకలు, దంతాలు, బలంగా వుంటాయి. రాగులు, సజ్జలలో కాల్షియం ఇనుము వుంటాయి. బెల్లం, చింతపండులో రక్త శుద్ధికి కావాల్సిన ఇనుము వుంటుంది. తోటకూర, బచ్చలి, గోంగూర మొదలగు ఆకుకూరల్లో పుష్కలంగా వుంటాయి. పప్పుధాన్యాలు, కాయగూరలు, మాంసం, చేప, పాలు, గుడ్లు, పండ్లు, మంచినీరు మొదలగు వాటిల్లో ఖనిజ లవణాలు లభ్యమవుతాయి.

4. నీటివాడకం : వీలైనంత నీరు ఎక్కువగా తాగటం ఆరోగ్యానికి మంచిది. తాగేనీరు తినటానికి 15 నుండి 30 ని॥లు ముందుగా అట్లాగే భోజనానంతరం 1 నుండి 2 గంటల తరువాత తీసుకోవటం మంచిది. కారణం - తినేటప్పుడు మధ్యలో నీరు తాగటం వలన, అరుగుదలకు ఉత్పత్తి అయ్యే ఎంజైమ్స్ పలుచబడి (డైల్యూట్అయి) తిన్న ఆహారం సక్రమంగా జీర్ణం కాకపోవచ్చు. అంతేగాక ముందుగానే నీరు తాగటం వలన ఆహారం పరిమితంగానే తీసుకోవాల్సి వస్తుంది. - ఉదయం తెల్లవారు జామున లేవగానే ముఖం కడుక్కొని గాని లేదా నీళ్ళతో పుక్కిలించిన తర్వాత కనీసం 1 లీటరు (ఒకటిన్నర లీటరు అయితే ఇంకా మంచిది) నీరు తాగితే మంచిది. రోజూ కనీసం 4, 5 లీటర్ల నీరు తాగటం ఆరోగ్యానికి అవసరం.

5. వ్యాయామం : రోజూ జాగింగ్ లేదా రన్నింగ్ లేదా యోగాసనాలు లేదా ఫిజికల్ ఎక్సర్ సైజులు చేయటం అవసరం. ఇవేవీ చేయకపోయినా రోజూ కనీసం 20 నుండి 30 నిమిషాలు లేదా 3, 4 కి.మీ. దూరం తగ్గకుండా వేగంగా నడిచే అలవాటు చేసుకుంటే మంచిది. రోజులో ఏ వేళప్పుడు చేసినా మంచిదే. సాధారణంగా రోజువారీ పనిలో అనేకసార్లు నడవాల్సి వచ్చినపుడు - నెమ్మదిగా, తాపీగా గాకుండా వేగంగా నడిచే అలవాటు చేసుకున్నా సరిపోతుంది. అదే బాడీకి ఎక్సర్‌సైజుగా పని చేస్తుంది. (బి.పి., స్థూలకాయం, మధుమేహం, గుండె జబ్బులు వున్నవారికి నడక ఎంతో అవసరం)

6. పంటిశుభ్రత : ఉదయం పళ్ళు కడుక్కోవటానికి కొందరు బ్రష్‌తో 10 నుండి 30 నిమిషాల వరకు తోముకుంటారు. సాధారణంగా ఈ పంటి జబ్బులు లేని వారు మీడియం బ్రష్‌లు వాడాలి. బ్రష్‌పై పెట్టుకున్న పేస్టును లోపలకు దిగేలా బ్రష్‌ను కదలించాలి. నోటిలో ప్రధానంగా తోముకోవాల్సింది చిగుళ్ళను. పంటిపైన ఎక్కువ సేపు తోముకోవాల్సిన అవసరం లేదు. అలా చేయటం వలన పంటిపై ఉండే 'ఎనామిల్' కరిగిపోయి పళ్ళు సలపరం పుడతాయి. పళ్ళు తోముకోవటం 2, 3 నిముషాలలో ముగించాలి. రాత్రిపూట కూడా రెండు నిమిషాలు బ్రష్ చేసుకోవటం వలన వాసనకు, ఆరోగ్యానికి అన్ని విధాల మంచిది. పంటి జబ్బులు చాలా వరకు నిర్లక్ష్యం, అశ్రద్ధ వలన మాత్రమే వస్తుంటాయి. పంటిద్వారా వచ్చే ఇన్‌ఫెక్షన్స్ పంటి జబ్బులకు కూడా దారితీస్తాయి.

7. ఒంటి శుభ్రత : ఉదయం పూట స్నానం చేసి నీట్‌గా తయారై బయట రోజువారీ కార్యక్రమాల్లో నిమగ్నమవుతాం. పగటి పూట బయట పనిలో దుమ్ము, ధూళి, మురికి సహజంగానే వంటిపైకి చేరుతుంది. రాత్రికి ఇంటికి చేరాక సింపుల్‌గా కాళ్ళు చేతులు ముఖం కడుక్కొని, తిని ఒంటికున్న మురికితోనే చక్కగా పడుకుంటాం. సువాసన, నీట్‌గా బయట - వాసన, మురికితో ఇంట్లో - ఈ పద్ధతి ఆరోగ్యకరం కాదు. రాత్రిపూట కూడా స్నానం చేయటం వలన హాయిగా నిద్రపట్టడమే గాక, పక్కన పడుకున్న వారికి కూడా కంపు లేకుండా వుంటుంది.

8. నిద్ర, విశ్రాంతి : 20 సంవత్సరాల పై బడిన వారికి రోజువారి నిద్ర దాదాపు 6 గంటలు సరిపోతుంది. ఆరోగ్యంగా అలవాటుతో కొంతమందికి కొంత తక్కువైనా సరిపోతుంది. నిర్దిష్టమైన మెడికల్ కేసుల్లో కొంచెం ఎక్కువగా అవసరపడుతుంది. రోజులో ఏదో సమయంలో మధ్యాహ్నం లేదా బాగా అలిసిపోయిన సమయంలో మత్తుగా అనిపించితే కనీసం 15, 20 నిమిషాలు కునుకు తీస్తే అలసట తీరి, తిరిగి పని చేయటానికి ఉత్సాహంగా వుంటుంది.

9. కాఫీ, టీలు తాగటం : పరిమితంగా తీసుకోవటం వలన ప్రమాదముండదు. వీటి మోతాదు కాస్త మించితే నిద్రలేమి కలగడం, వణుకు రావడం, గుండె వేగంగా కొట్టుకోవడం, దడ అనిపించడం జరుగుతుంది. కడుపులో మంట, నొప్పి వస్తాయి. ఎసిడిటీకి దారితీస్తాయి. గుండెజబ్బు, రక్తపోటు ఉన్న వారిలో ఈ బాధలు మరింత ఎక్కువ అనిపిస్తాయి. అంతేకాదు కాఫీ, టీలు రక్తంలో కొవ్వు పదార్థాలు ఎక్కువ చేరటానికి సహకరిస్తాయి. దానివల్ల రక్త నాళాలు గట్టిపడతాయి.

10. పొగతాగటం : చుట్ట, బీడి, సిగరెట్లలో ఉండే నికోటిన్ పదార్థం గుండె వేగాన్ని పెంచుతుంది. రక్తపోటు ఎక్కువవుతుంది. గుండెమీద శ్రమ ఎక్కువవుతుంది. పొగతాగటం వలన రక్తనాళాలు అనారోగ్యంగా తయారవుతాయి. ఫలితంగా గుండె బలహీనత, రక్తనాళాల నీరసం, స్మోకింగ్ వల్ల కలిగే అధిక శ్రమని తట్టుకోలేక హార్ట్ ఎటాక్‌ను కొని తెచ్చిపెట్టుకోవడమే. అంతేకాదు రక్తంలో ప్రాణవాయువు తక్కువై అలసట, నీరసం - ఇవీ పైకం ఖర్చుతో తెచ్చుకునే అనారోగ్యకరమైన ప్రయోజనాలు. గుట్కా, జర్దాపాన్ తినే అలవాట్లు ప్రమాదకర జబ్బులకు మరింత దగ్గర దారులు, తస్మాత్ జాగ్రత్త.

11. జుట్టు ఊడిపోవడం, వెంట్రుకలు తెల్లబడటం : సమగ్ర పోషకాహార లోపం వలన చుండ్రు, మురికి చేరటం వలన సాధారణంగా జుట్టురాలిపోతుంది. సమగ్ర పోషకాహారం తీసుకోవటం వలన అన్ని విటమిన్స్ లభ్యమై జుట్టు ఊడిపోకుండా గట్టిగా వుండిపోతుంది. ఎప్పటికప్పుడు ఒంటికి మాదిరిగానే తలపై మురికి వదిలించుకోవటం అవసరం. ఎప్పటికప్పుడు శుభ్రంగా తలస్నానం చేయటం, అప్పుడప్పుడు నిమ్మరసం పెట్టి తలస్నానం చేస్తే చుండ్రు పోవటానికి బాగా ఉపయోగపడుతుంది.

అట్లానే జుట్టు తెల్లబడటానికి కారణం వాతావరణ కాలుష్యం, వారసత్వం, సమగ్ర పోషకాహార లోపం ప్రధాన కారణాలు. వీటికై రకరకాల క్రీములపై ఆశతో ఖర్చు పెట్టడం వృధా ప్రయాసే.

12. పోషకాహార లోపం వలన పిల్లలు శారీరకంగా బలహీనమై పోవటమే కాకుండా వారిలో వ్యాధి నిరోధకశక్తి కూడా తగ్గిపోతుంది. బిడ్డకు నాలుగు, ఐదు నెలల్లు వచ్చిన దగ్గర నుంచి ఆకుకూరలు ఉడకబెట్టి పెట్టవచ్చు. క్యారెట్, టమాటో, వంకాయ వంటి కూరగాయలు ఉడకబెట్టి, నిమ్మపండు రసం కాస్త పిండి మెత్తగా చేసి తినిపించ వచ్చు. చిన్నపిల్లలకు అన్నంతో పాటు ఉడకబెట్టిన పప్పులు, ఆకుకూరలు, కాయగూరలు, పాలు, పళ్ళు పెట్టకపోతే పోషకాహార లోపానికి గురవుతారు. బిడ్డకు సంవత్సరం వయస్సు వచ్చేసరికి పెద్దవారు తినే ఆహారమే మామూలుగా పెట్టవచ్చు. దానితో వారిలో పోషకాహార లోపం వల్ల వచ్చే వ్యాధులు వుండవు. ఆరోగ్యంగా ఎదుగుతారు. ఆరోగ్యానికి సంబంధించిన ఈ విషయాలు మరింత సమాచారంతో తెలిసి వుండవచ్చు. కావాల్సింది ఆచరించటం. తెలిసీ ఆచరించకపోతే అనారోగ్యాన్ని ఆహ్వానించటమే అవుతుంది. పెద్దలు చెప్పినట్లు 'మంచిదని భావిస్తే వెంటనే ప్రారంభించాలి' 'చెడ్డదని భావిస్తే వాయిదావేస్తూ పోవాలి'! కనుక ఈ సూక్తిని పాటించి మనమూ ప్రయోజనం పొందుదాం.

★











సులభ శైలిలో తెలుగు భాషా చరిత్రను అందించిన 'వెలమల'

తెలుగు భాషకున్న ప్రత్యేకతలు, విశిష్టతలు మరేభాషకూ లేవనడంలో సందేహం లేదు. తెలుగుభాష సంగీతానికి అనువైన భాష. ఎంతో మధురంగా, కమ్మని తీయని పదాల సమూహమే తెలుగుభాష. తెలుగులో ప్రతీపదం అచ్చుతో అంతమవుతుంది. అందుకే దానిని అజంతాభాష అన్నారు. ఇదే లక్షణం 'ఇటాలియన్'కూ ఉంది. అందుకే మన భాషను 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్'గా చెప్పుకుంటాం. దాదాపు 4 వేల సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర వున్న తెలుగు భాష మాట్లాడే వారి సంఖ్య నేడు తగ్గుతోంది. అధికార భాషా సంఘం, తదితర సంఘాలు చేసేది తక్కువ. ఆర్భాటాలు ఎక్కువ.

ఇప్పటికే మన భాషలో ప్రామాణికమైన నూతన పదాలతో ఏర్పరచుకున్న నిఘంటువు లేకపోవడం తెలుగువారిగా సిగ్గుపడాల్సిన విషయం. తెలుగు గురించిన అనేకానేక విషయాలు, విశిష్టతలు, చివరికి తెలుగులోని మాధుర్యాన్ని కూడా పాశ్చాత్యులు చెప్తే 'ఓహో అలాగా' అని ఆలకించాం. అంతేగాని మన తెలుగును మనం ఉద్ధరించిన దాఖలాలు లేవు. అధికార భాషగా అధికారికంగా ప్రకటించుకొని నలభై సంవత్సరాలైంది. చిత్తశుద్ధిలేని అధికార, అనధికారుల చర్యల ఫలితంగా తెలుగువాడినని గర్వంగా చెప్పుకునే దశ నుండి "ఐ డోంట్ నో తెలుగు" అని పరాయిభాషలో చెప్పుకునే హీనస్థితికి చేరుకుంటున్నాం. 1974లో ఏర్పడిన అధికార భాషా సంఘం చేసిందేమిటో నేటికీ మిష్టరీయే. తమ తమ స్వలాభాల కోసం, ఇమేజిని పెంచుకోవడం కోసం పదవుల్ని వాడుకున్నారనే అపవాదూ ఈ సంఘం మీద ఉంది. ఇదెంతవరకు నిజమనే విషయాన్ని పక్కన బెడితే సరైన చర్యలు తీసుకుంటే నలభై సంవత్సరాలకు కూడా ప్రభుత్వ జి.ఓ.లు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు నలభైశాతం కూడా సాధించలేమా? అనే ప్రశ్నలు ముందుకొస్తాయి. ఎన్ని నివేదికలు, మరెన్నో కమిటీలు, ఏ నివేదికలూ ప్రభుత్వాన్ని, పాలకులను, అధికారులను కదలించలేకపోయాయి.

ఘనాపాటి చరిత్ర ఉన్న తెలుగు గురించిన పరిశోధనలు విషయ సంపద గతంలో జి.ఎస్.రెడ్డి, ఆచార్య భద్రిరాజుల కృష్ణమూర్తి, బి.రామరాజు, కందప్ప చెట్టి వంటి భాషావేత్తలు చేసిన కృషి ఫలితమే. ఈ పరిశోధనలను ప్రపంచ దృష్టికి తీసుకుపోయిన ఘనత భద్రిరాజు కృష్ణమూర్తి, చేకూరి రామారావులకే దక్కింది. ఇక్కడొక విషయం చెప్పాలి. కానీ వీరి పరిశోధనలు, పరిశోధనా పత్రాలు చాలా వరకు మేధావి వర్గానికే పరిమితమయ్యాయి. అత్యున్నత స్థాయికి చెందడం అనేది ప్రపంచ భాషావేత్తలను ఆకర్షించిన లక్షణమనగా నేటి తరానికి బహుదూరంగా ఉండటం. మరోలక్షణంగా ఉన్నాయన్న విషయాన్ని కొట్టిపారేయలేం. ఏదిఏమైనా క్లిష్టమైన విషయాలు, సాంకేతిక పద వివరణ లేకపోవడం, వ్యాసాల రూపంలో కట్‌కట్‌గా ఉండటం వల్ల 'తెలుగు భాషా చరిత్ర'కు సివిల్స్, గ్రూప్-1, నెట్, స్లెట్ విద్యార్థులు ప్రామాణిక గ్రంథంగా భావించే



భద్రిరాజు కృష్ణమూర్తి గారి సంపాదకత్వంలో వచ్చిన పుస్తకం ఇప్పటికీ క్లిష్టంగానే ఉంది.

భాషా చరిత్ర అనగానే ఒక శాస్త్రీయమైన దృష్టి ఉంటుంది. పరిపూర్ణత, భాష మీద పట్టు ఉన్న వారికి అర్థమయ్యే పరిశోధనా వ్యాసాలే ఇప్పటివరకూ మన తెలుగు వారికి అందుబాటులో వున్నాయి. ఈ పుస్తకం తొలి ముద్రణ 1974లో కావడం వల్ల భాష, శైలి కూడా క్లిష్టంగా ఉంటుందని సివిల్స్‌లో తెలుగును ఆప్షనల్‌గా తీసుకొనే నాన్ తెలుగు ఆస్పిరెంట్స్ అంటుంటారు. కచ్చితంగా నూటికి తొంభైతొమ్మిది శాతం అందరికీ అర్థమయ్యే సులభశైలిలో తెలుగు భాషా చరిత్రను తెలుగు వారికి అందించారు వెలమల సిమ్మన్న. ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న సిమ్మన్న 'తెలుగు భాషా చరిత్ర'ను 654 పేజీలతో సమగ్రంగా, సులభరీతిగా విశ్లేషణాత్మకంగా వెలువరించారు. గతంలో 'వెలమల' తెలుగు భాష మీద అనేక వ్యాసాలు రాసిన అనుభవం ఉంది. పలువురి ప్రశంసలందుకున్న గ్రంథాలను కూడా తెలుగు వారికందించిన సిమ్మన్న నేర్పు ఈ పుస్తకంలోని ప్రతీ పేజీలో కన్పిస్తుంది.

ఈ పుస్తకంలో సమాచారాన్ని అంశాల వారీగా విభజించడం అనేది తెలుగు సాహిత్యంతో గానీ, భాషా చరిత్రతోగానీ పరిచయం లేని వారికి సైతం ఆసక్తిని కలిగించే లక్షణం. ఆంధ్ర-తెలుగు-తెనుగు పదాలు అనే చాప్టర్‌లో ఆంధ్ర పద ప్రాచీనత, వ్యాప్తి, చరిత్ర, వ్యుత్పత్తి వంటి విషయాలను కూలంకషంగా వివరించిన తీరు శాస్త్రీయంగా ఉంది. విద్యార్థి చదువుతుంటే మరింత ముందుకు నడిపించే గుణం ప్రతీ చాప్టర్‌లో ఉండటం విశేషం.

1968లో ఆంధ్ర సారస్వత పరిషత్తు తీసుకొచ్చిన 'తెలుగుపై ఉర్దూపారసీకముల ప్రభావం' అనే గోపాల కృష్ణారావుగారి గ్రంథాన్ని మరింత సులభంగా అందరికీ అర్థమయ్యేట్లు అందించగలిగారు. 'వెలమల' తెలుగు మాండలికాల మీద ఇచ్చిన విషయ వివరణ చాలా అర్థవంతంగాను, శాస్త్రీయంగాను, క్లుప్తంగాను ఉంది. ఎక్కడా కూడా పాఠకుడికి విసుగు కలిగించని శైలి సిమ్మన్న ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. ద్రావిడ భాషలు, భాషా సమాజాల విభజనలపై విషయం సమగ్రంగా ఉండటం మరో ప్రత్యేకత.

ద్వ్యాత్వాదులు, క్వార్థి కామ్రేడితము, సాదుశకట రేపల వర్ణైక్యం వంటి తెలుగు సాంకేతిక పదాలను పఠితకు అవసరానుగమ్యంగా పరిచయం చేయడం వల్ల మరింత ఉపయోగకారిగానే కాకుండా ఆసక్తిగాను ఉంది. "ఓ మంచి పుస్తకం పదిమంది స్నేహితులతో సమానమంటారు" వెలమల సిమ్మన్న. 'తెలుగు భాషా చరిత్ర'లో సమాచారం పదిమంది భాషా శాస్త్రవేత్తల పుస్తకాల్లోని విజ్ఞానానికి సమానమని చెప్పడానికి ఏ మాత్రం సందేహం లేదు.

తెలుగు భాషా చరిత్ర మీద ఈ మధ్య కాలంలో వచ్చిన గ్రంథాల్లో ఈ పుస్తకం 'మేలిమి బంగారం'గా చెప్పొచ్చు. సివిల్స్ విద్యార్థులకు, నెట్, స్లెట్ విద్యార్థులకు, గ్రూప్స్‌కు ప్రిపేరయ్యే విద్యార్థులకు ఇది మరింత ఉపయోగకారి. పోటీ పరీక్షలకు తెలుగును ఆప్షనల్‌గా ఎంచుకున్న ప్రతి ఆస్పిరెంట్‌కు సహాయకారిగా, సలహాదారుగా, ప్రామాణిక గ్రంథంగా 'తెలుగు భాషా చరిత్ర'ను అందించిన వెలమల్ల సిమ్మన్న అభినందనీయులు.

- సైదులు ఐనాల

క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దంలోనే తెలుగునేలపై బౌద్ధం వెల్లివిరిసింది. శాతవాహనుల పాలనలోనే ఈ నేల నాలుగు చెరగులా బౌద్ధమతం వ్యాపించింది. రాష్ట్రం నలుమూలలా 52 ప్రాంతాల్లో ఇప్పటికీ కనిపించే ఆనాటి బౌద్ధమత ఆరామాలు, చైత్యాల అవశేషాలే దాని వైభవానికి చిహ్నాలు. మహాయాన బౌద్ధాన్ని విశ్వవ్యాప్తం చేసిన ఆచార్య నాగార్జునుడు ఇక్కడివాడే. దక్కను పీఠభూమిలో తక్కువగా, కోస్తా తీరాన ఎక్కువగా దీని అవశేషాలు కనిపిస్తాయి. నదీతీరాలే ఆనాడు మత ప్రవాహానికి దారినిచ్చాయి. నేటి నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఉన్న ప్రదేశమే ఆనాటి శ్రీపర్వతం. ఇక్ష్వాకులకు రాజధానిగా ఉన్న విజయపురిలోనే నాగార్జునుడు తన బోధనలు వినిపించాడు. ఇక్కడి నుండే చైనా, జపాన్, శ్రీలంకలకు బౌద్ధం పాకింది. శాంతిని, సహనాన్ని, అహింసను బోధించిన బౌద్ధానికి రాష్ట్రంలో ఇప్పటికీ ఆదరణ ఉన్నదని చెప్పడానికి హైదరాబాద్ నగరంలోని హుస్సేన్‌సాగర్ నడిబొడ్డున ప్రతిష్ఠించిన భారీ బుద్ధుని విగ్రహమే సాక్ష్యం. బౌద్ధమతం వెల్లివిరిసిన ప్రదేశాలు చాలావరకు ఇప్పుడు పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చెందుతున్నాయి. పాలకుల నిర్లక్ష్యం కారణంగా మరికొన్ని శిథిలమవుతున్నాయి.

బౌద్ధం వెల్లివిరిసిన చోటిది.....

శేషు

1950వ దశకంలో నాగార్జునసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్ట్ కోసం జరిపిన తవ్వకాల్లో అద్భుత, అపురూపమైన బౌద్ధమతం వెలుగొందిన కాలం నాటి వస్తువులు, విగ్రహాలు, కట్టడాలు కనిపించాయి. అప్పటికే విజయపురిలో శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలను జాగ్రత్తగా తొలగించి రిజర్వాయర్ నడిమధ్యలో గల పర్వతంపై భద్రపరిచారు. భారత పురాతత్వ శాఖ ఆరేళ్ళపాటు శ్రమించి తరలించే కార్యక్రమాన్ని పూర్తి చేసింది. మ్యూజియం ఉన్న కొండను నాగార్జునకొండగా పిలుస్తున్నారు. విహారం ఆకారంలో మ్యూజియంను నిర్మించారు. రిజర్వాయర్ ఒడ్డునుండి పర్యాటక శాఖ వారు మ్యూజియం ఉన్న పర్వతం వద్దకు లాంచీలను నడుపుతున్నారు. రాష్ట్రంలో కనిపించిన బౌద్ధ ప్రాంతాలన్నీ నదీ తీరాల వెంటే ఉండటం విశేషం.


నాగార్జునసాగర్ మ్యూజియం


అమరావతి


తొట్లకొండ

అమరావతి

రాష్ట్రంలో నాగార్జునసాగర్ తర్వాత బౌద్ధమతానికి సంబంధించి అత్యంత విలువైన ప్రదేశంగా అమరావతి గుర్తింపు పొందింది. శాతవాహనుల కాలంలో ధాన్యకటకంగా ప్రసిద్ధి పొంది కొంతకాలం పాటు వారి రాజధానిగా ఉంది. గుంటూరు జిల్లాలో జిల్లా కేంద్రానికి 60 కిలోమీటర్ల దూరంలో కృష్ణాతీరానే గల అమరావతిలోని బౌద్ధస్తూపం దేశంలోనే పెద్దదిగా పేరుగాంచింది. ప్రస్తుతం ఈ స్తూపంలోని కొన్ని ముఖ్య భాగాలు చెన్నై, లండన్ మ్యూజియాల్లో ఉన్నాయి. ఇక్కడ తవ్వకాల్లో లభించిన వాటితోనే అమరావతిలో పెద్ద మ్యూజియం ఏర్పాటు చేశారు. వీరశైవం విజృంభించిన కాలంలో అమరావతిలో బౌద్ధ ఆరామం స్థానంలో శివాలయం వెలిసింది.

బావికొండ

బౌద్ధ మతాన్ని స్వీకరించిన అశోకుడు కళింగ యుద్ధానంతరం అక్కడ కూడా బౌద్ధాన్ని వ్యాప్తి చేశాడు. ఒకప్పుడు కళింగ రాజ్యంలో భాగంగా ఉన్న బావికొండ విశాఖ నగరానికి ఉత్తర దిశగా ఉంది. ఈ ప్రాంతమంతా అనేక బౌద్ధ స్తూపాలు, విహారాలు కనిపిస్తాయి. అదేవిధంగా ప్రాచీన కాలంలో తవ్విన అనేక బావులు శిథిలావస్థలో ఉన్నాయి. ఆనాటి బౌద్ధ విహారాల్లో నివసించే సన్యాసులు పంటలు పండించేందుకు అవసరమైన నీటివసతి కోసం ఈ బావులు తవ్వి ఉంటారని భావిస్తున్నారు.

ధూళికట్ట

కరీంనగర్ జిల్లాలో ఉన్న ధూళికట్టను క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దంలో చంద్రగుప్తుడి ఆస్థానంలో ఉన్న గ్రీకు రాయబారి మెగస్తనీస్ సందర్శించినట్లు ఆధారాలున్నాయి. ఇక్కడ గల మహాస్తూపం శిథిలాల వద్ద రోమన్, శాతవాహనుల కాలం నాటి రాజముద్రలు, నాణాలు లభించాయి. ఇంకా అనుపు, జగ్గయ్యపేట, భట్టిప్రోలు, చందవరం, ఘంటసాల, గుంటుపల్లి, పావురాలకొండ, తొట్లకొండ, రామతీర్థం, శంకరం, సాలిహుండం, దంతపురం తదితర ప్రదేశాల్లో కూడా బౌద్ధ మత అవశేషాలు చూడవచ్చు. ★

మానవీయ సంబంధాలను ప్రమోట్ చేస్తున్న నాటకరంగం



పరుచూరి రఘుబాబు స్మారక నాటకోత్సవాలపై సమీక్ష

నేటి స్పీడు యుగంలో నాటకరంగం భవిష్యత్తేమిటి? అని ఆ రంగంలో ఉన్న వాళ్ళనే అడిగితే "ఏమీ చెప్పలేని పరిస్థితి. ఏమవుతుందో చెప్పలేం..." అని గత పదిహేనేళ్ళుగా అంటూనే వున్నారు. కానీ ఈ పదిహేనేళ్ళుగా నడుస్తూనే ఉంది. నాటకం నిలబడే వుంది. నిలబడుతుంది అనే ఆశ మిణుకుమిణుకుమంటూనే వుంది.

శంకర్

బహుశా ఇతర ఏ మీడియాకు లేని ఒక గొప్ప లక్షణం దీనికుంది. జానపద కళారూపాల తరువాత నాటకానికీ ప్రేక్షకులకూ మధ్య ఉండే సంబంధమే సజీవమైంది. నటుడి నటన, ప్రేక్షకుడి స్పందన ఎప్పటికప్పుడు ఏకకాలంలో సాగే సజీవ సంబంధం. అందువల్లే ఏ మీడియాకన్నా ఈ మీడియాకే ఎక్కువ సామాజిక బాధ్యత నిర్వర్తించే వీలు, కర్తవ్యం వుంది. అది పాటించిన నాటిక, నాటకం మాత్రమే ప్రేక్షకుల మన్ననలను పొందుతోంది. ఇటీవల హైదరాబాద్ నగరంలో నిర్వహించిన రఘుబాబు స్మారక నాటక, నాటిక పోటీలలోని ప్రదర్శనలన్నీ దాదాపు ఈ అంశాన్ని వ్యక్తం చేశాయి. కొన్ని ప్రదర్శనలు మానవీయ కుటుంబ సంబంధాల లేమిని వ్యక్తం చేశాయి. మరికొన్ని సామాజిక దృక్పథాల్లోని వ్యక్తితత్వం తగదని చెప్పాయి. మరికొన్ని సాంస్కృతిక కాలుష్యాన్ని వ్యతిరేకించాయి. డబ్బు సంబంధాల వికృత రూపాన్ని బట్టబయలు చేశాయి. మహిళలపై సామాజిక, కుటుంబ అణచివేతకు అద్దంపట్టాయి. 2000వ సంవత్సరం నుండి పరిషత్‌ల నాటకరంగం సామాజిక వాస్తవికతకు కట్టుబడక తప్పలేదు. ఆ సంవత్సరం నుండి ప్రపంచీకరణ ఫలితాలు కుటుంబ జీవనంపై, సంస్కృతిపై పడే నీడల్ని కొన్ని చూపాయి. కొడుకుల తరం (వర్తమానం) తప్పుదోవ పడితే సరిచేసే తండ్రులను చూపాయి. ఆ ట్రెండ్ మారి నూతన ఆర్థిక విధానాల నలుగుడులో పడిన తండ్రుల తరం (వర్తమానం)కి అటు తాతలు (భూతకాలం) ఇటు మనుమలు (భవిష్యత్) తరాలు రాబోయే కాలం మారి తీరాలనే ధోరణిని వ్యక్తం చేస్తున్నాయి. 2003లో 'అజో-విభో' అమెరికా వారి ప్రిస్క్రిప్షన్ వల్ల మంచి కథలకు నాటిక రూపాంతరం చేయడంలో పడి కొత్త నాటిక రచనకు బ్రేక్ పడిందనాలి. 2004లో ప్రత్యేకంగా ఒక ట్రెండ్ లేకపోయినా "అనేక ధోరణుల కాక్‌టెయిల్"గా వచ్చాయి.

నాటకరంగం - దాని దుస్థితి - భవిష్యత్తును గురించి సమీక్ష చేయడమే ఇతివృత్తంగా ఒంగోలు, అభ్యుదయ కళాసమితి వారు 'యువనిక' నాటిక, హైదరాబాద్, కళారాధన సంస్థ వారు 'జీవన్నాటకం' (నాటకం) ప్రదర్శించారు. నటులు మరణించినా నాటకం మరణించదు. అది అజరామరం అని సందేశం ఇచ్చి, రిహార్సల్స్ దగ్గర నుండి నాటకరంగం యొక్క ఒడిదుడుకులను ప్రదర్శించాయి. విశ్వనాథ కవిరాజు 'నేపథ్యం' నాటిక 1937ల నాడే ఓ గొప్ప సెటైరికల్‌గా రంగస్థలం వెనుక జరిగేదాన్ని స్టేజీమీద నిలబెట్టి రివ్యూ చేశారు. 'మన వీరోగారు(రాలేదు గానీ... ముందు తమరు క్షవరం అవుతారేటి బాబూ" అని మేకప్ ముందు షేవింగ్

చేసే మంగలివాని డైలాగ్‌తో ప్రారంభించిన ఆ నాటిక ఈ సందర్భంగా గుర్తుకు వస్తుంది.

అత్యంత ప్రభావపూరితమైన సినిమా కళ వల్ల ఎడాల్సెంట్‌పై (ఎదిగీ ఎదగని యవ్వనంపై) 7వ తరగతి నుంచే క్లాస్‌రూమ్ ప్రేమ, వీధి మలుపు బీట్‌ల, దొంగచాటు ముద్దులు వంటి సాంస్కృతిక పెనుకాలుష్యం పడిపోయింది. ఆ డ్రైనేజీ కుళ్ళు ప్రవాహాన్ని కడిగే బాధ్యత నాటకం తీసుకుంది. వల్లూరి శివప్రసాద్ గారి 'ప్రేమాతురణం' నాటిక పెదకాకాని గంగోత్రి ప్రదర్శించింది. 'ప్రేమంటే అనుబంధాల స్వరూపమేగానీ మర్మాంగాల రాపిడి కాదు' అని పచ్చినిజం చెప్పింది. 'ప్రేమంటే నమ్మకం లేక కాదు.... ప్రేమించే వారిపై నమ్మకం లేక' అని అందులోని పూర్ణయ్య తాతగారు పాత్ర (నాయుడు గోపి) డైలాగ్ ఆ నాటిక యొక్క ఆయువు పట్టు.

రసఝురి, పొన్నూరు వారి నాటిక 'సంపద' నేటి గ్లోబలైజేషన్ పుణ్యాన అల్లకల్లోలమైన కుటుంబ జీవనంలోని మనుషుల మధ్య సంబంధాలను ఎత్తిచూపింది. అందులోని శతాధిక వృద్ధురాలు పాత్ర రివాల్వింగ్ పాయింట్. ఆ పాత్రకు తగ్గ వయస్కురాలైన, కళారంగ పెద్దమ్మ సీతాలత గారు చాలా చక్కగా అభినయించారు. (రవీంద్ర భారతిలోని ప్రేక్షకులూ, వేదికపై పెద్దలూ లేచి నిలబడి అభినందించారు.) ఆ పాత్ర ఓ మంచి వివాదాస్పద చిత్రం 'ఫైర్' సినిమాలోని ముసలమ్మ పాత్ర (అందులోనూ గంటకొట్టి తన ఉనికినీ, తన భాషణను వ్యక్తం చేసే పాత్ర) గుర్తుకు వచ్చినా అదొక కాంటెస్ట్‌లోని పాత్రయితే, సంపద నాటకంలోనూ ఓ విలక్షణ కాంటెస్టులోని పాత్ర. రచయిత, దర్శకుడు, పాత్రధారి వై.ఎస్.కృష్ణేశ్వరరావుగారి ఈ పాత్ర ప్రయోగం మంచి ప్రయోగమేననిపిస్తుంది. 'నిజమైన సంపద అనిర్వచనీయమైన మానవీయ కుటుంబ సంబంధమే... దాని ముందు ఏ సంపద సమానం కాదని' చాటుతుంది. ఈ నాటిక ఉత్తమ నాటిక, ఉత్తమ నటుడు, ఉత్తమ క్యారెక్టర్ నటి బహుమతులు గెలుచుకుంది.

దివాకర్ బాబు విలక్షణ ప్రయోగం 'నమోనమః' హైదరాబాద్‌కు చెందిన కళా సంస్థ ప్రదర్శించింది. ఒక కృత్రిమ కాన్వాసుపై, వండిన సమస్య అయినా చాలా చక్కటి సామాజిక సంబంధాల్ని డిబేట్ చేసిన నాటిక. 'ధనం' యొక్క క్రూర, మోసపూరిత నైజాన్ని, దిగజారుడుతనంలో పడితే శాస్త్రవిజ్ఞానం, అనైతికతలకు గురైతే కళారంగం దుస్థితిని తెలియజేసింది. అన్నంపెట్టే అన్నదాత ఈ సమాజానికవసరమైన వాడు అని చెప్పి... ఆ అన్నదాత శ్రమకు ఈ మూడు రంగాలు నిజాయితీతో కూడిన తోడ్పాటు అవసరమని తీర్పు చెప్పింది. ఈ నాటిక ద్వితీయ ఉత్తమ నాటికగా గెలుపొందింది.

ప్రస్తుతం ప్రపంచాన్ని ఒణికిస్తున్న ఎయిడ్స్... ఆ ఎయిడ్స్ బారిన పడిన బాధితుడి కుటుంబం పట్ల సమాజ స్పందనపై అమృత వర్షిణి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్‌వారి 'నిశ్శబ్ద గాయం' నాటకం ఉత్తమ నాటకంగా ఎన్నికయ్యింది. ఓ మంచి భార్యాభర్తల అనురాగ బంధాన్ని వ్యక్తం చేయడానికి 'ఇదుగో దేవుడు చేసిన బొమ్మ' నాటకంలో మరణించిన భర్త స్థానంలో ఒక మరబొమ్మ పాత్రను సృష్టించారు. ప్రెజెంటేషనైతే బాగుంది కానీ ఆ మరబొమ్మ మనిషి చేసినదే కదా. నీటి సమస్య, నీటి తగవులు, నీటి రాజకీయాలపై విశ్వకవి రవీంద్రుడి 'ముక్తధార' నాటకం, విశాఖ కళా నిలయం వారి 'నీరు' నాటిక ప్రదర్శించారు. 77 ఏళ్ళ క్రితమే రవీంద్రనాథ్ ఠాగూర్ అద్భుత రచనకు నాటకరూపం ముక్తధారను 60 మంది భారీ తారాగణంతో, సురభి వారి టెక్నిక్‌లతో చక్కగా ప్రదర్శించారు.

మహిళా సమస్య కథా వస్తువుగా విజయనగరం, ఈస్ట్‌కల్చరల్ వింగ్ 'ఎనిమిదో అడుగు', కాకినాడ ఉమా ఆర్ట్స్ వారి 'పంచభర్తృక', ప్రకృతి=స్త్రీ అనే ఈక్వేషన్‌లో 'నారీస్వరం' తదితర ప్రదర్శనలు వచ్చాయి. 'వేసిన ఏడడుగుల్లోనే ఆడది వుంటేనే సుఖ జీవనం... ఆమె ఎనిమిదో అడుగు వేయించే స్థితి రానివ్వకండి. వేసిందో....' అనే హెచ్చరిక, కార్యేషు, కరణేషు, శయనేషు, భోజ్యేషు... ఈ నాలుగు కర్తవ్యాల్లోనూ నలిగి వేసారిన స్త్రీ ఆగ్రహించినా క్షమయా అనే కర్తవ్యం ప్రకారం ధరిత్రిలా క్షమించేస్తుందిలే అనే భరోసా ఈ రెండు నాటికలు ఇచ్చాయి.

బాల్యంలో తల్లిదండ్రుల ఆప్యాయత లేకుండా పెరిగిన వాళ్ళు ఎలా ఉంటారో 'రిక్తసంబంధాలు', గద్దెనెక్కిన నాయకులు తిరిగి ప్రజల ముఖం చూడరని బెంగుళూరు జీవీ ఆర్ట్స్ వారి 'గొర్రెతేరు' ప్రదర్శించారు. మన దేశ రాజుల్లో ఐకమత్యం లేకపోతే ఎలా అలెగ్జాండర్ దేశాన్ని ఆక్రమించేశాడో చూడండి - అనే చారిత్రాత్మ కతను నిడివైన ఫ్లాష్‌బ్యాక్‌గా చూపెట్టి కొట్లాడుకుంటున్న రైతు అన్నదమ్ములను సఖ్యత పరిచిన రైతు ఇతివృత్తంతో 'బాధ్యత' నాటకం భారీస్థాయి ప్రదర్శనగా ఉంది.

నంది నాటకోత్సవాల్లో బహుమతులు పొందినవి కొన్ని పరుచూరి రఘుబాబు స్మారక నాటకపోటీల్లో రాకపోవటం... న్యాయనిర్ణయాల్లో వచ్చిన మార్పుల పట్ల కొన్ని టీములు అసంతృప్తిని వ్యక్తం చేశాయి. ఏదిఏమైనా కాంక్రీట్ జంగిల్‌లా ఘనీభవిస్తున్న హైదరాబాద్ నగరంలో 'రవీంద్ర భారతి' హౌస్‌ఫుల్‌గా జరిగిన ఈ నాటిక, నాటక పోటీలు నిర్వహించిన పరుచూరి బ్రదర్స్ అభినందనీయులు. ★

'నిశ్శబ్ద గాయం'లోని ఓ సన్నివేశం

తీర్పు

ఆత్మవంచనల నాగరికత
అందలమెక్కి వాగ్దానాలిస్తున్నపుడు
నిరాశలు నిట్టూర్పు సెగలకై
నిశ్శబ్దంగా మనసుని స్పర్శిస్తాయి.
చీకటి మబ్బులు కురిసిన జల్లుల్లోంచి
ఆకలి కేకల అడుగుల సవ్వడి
ఎగిసిపడే తరంగ నాదాలై
స్తబ్దతను చీల్చి శిలలను చైతన్యీకరిస్తాయి
ఆత్మీయత లేని చూపుల గాజు కళ్ళు
స్వచ్ఛత లేని మాటల గులాబీ ముళ్ళు
గుండెలో గుచ్చుకున్న విషాదపు ఛాయలు
శాంతి హృదిలో కత్తులు నాటుతూనే వుంటాయి.
సుఖం సుఖాన్ని ఆస్వాదించినట్లు
దుఃఖం దుఃఖాన్ని ఓదారుస్తుంది.
శిథిలమైన జ్ఞాపకాల సాక్షిగా
బతికినంత కాలం బతుకు వింతగాథల మయమే!
సూర్యోదయ సూర్యాస్తమయాల్ని
కాలం పక్షి రెక్కలుగా దాల్చి
ఆత్మవిశ్వాసపు పాదాల చెంత
శబ్ద సౌందర్యాన్ని సంతరిస్తుంది.
కలలాంటి జీవన మైదానంలో
కన్నీరు ప్రవహించని రోజుకై
కనులు కలలకై కలవరిస్తున్నా
కాలం తీర్పు కంటకప్రాయమే!
ఉసూరుమన్న ఊసుల లోకంలో
జీవన పయనమెప్పుడూ ప్రశ్నార్థకమే!
ప్రశ్నకు ప్రశ్నే సమాధానమైన వేళ
జవాబుకిక చిరునామా ఏదీ..?
స్పందించే హృదయ స్పందన నీవై
సంధించే వజ్రాయుధమూ నీవై
నీవు నీవుగా నిటారుగా నిలబడిన నాడు
నీ ఊపిరే తీర్పై మార్పు కేతన మెగరేస్తుంది

- సి.కామేశ్వరరావు

న్యాయ సలహాలు

ADVOCATE

- జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

ఖాళీ ఉన్నా నాన్‌లోకల్ అని ఇవ్వలేదు

నాకు హిందీ పండిట్ ట్రైనింగ్ ఎంట్రన్స్‌లో స్టేట్ ర్యాంక్ 396 వచ్చింది. మార్చి 3వ తేదీ నుండి సికింద్రాబాద్ వెస్లీగరల్స్ హైస్కూల్‌లో కౌన్సిలింగ్ జరిపారు. నా ర్యాంక్ ప్రకారం 4వ తేదీ మధ్యాహ్నం నేను కూడా కౌన్సిలింగ్‌కి హాజరయ్యాను.

మాది ప్రకాశం జిల్లా పామూరు. మా జిల్లా ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలోకి వస్తుంది. ఎ.యు. పరిధిలో ప్రభుత్వ కాలేజీలు లేవు. ఎస్.వి.యు. పరిధిలో నెల్లూరులో గవర్నమెంట్ కాలేజీ ఉంది. మాది బిసి(ఎ) వడ్డెర కులం. మేము కౌన్సిలింగ్‌లో పాల్గొన్నప్పుడు నెల్లూరు ప్రభుత్వ కాలేజీ పరిధిలో రిజర్వేషన్ కేటగిరీలో బిసి(ఎ) మహిళ సీట్లలో రెండు ఖాళీలు వున్నాయి. ఒక సీటు నెల్లూరు అమ్మాయి కోరుకుంది. మిగిలిన సీటుని నేను కోరుకున్నాను. ప్రకాశం జిల్లా శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ (ఎస్.వి.యు.)కి నాన్‌లోకల్ అవుతుంది. కాబట్టి సీటు ఇవ్వబోమని చెప్పారు. కౌన్సిలింగ్ 351-500 (ర్యాంక్) వరకు జరగడం పూర్తయ్యాక స్లైడింగ్‌లో గవర్నమెంట్ కాలేజీలలో మిగిలిపోయిన రిజర్వేషన్ సీట్లను భర్తీ చేశారు. ఆ రోజు కౌన్సిలింగ్ ముగిసే నాటికి నెల్లూరు కాలేజీలో బి.సి.(ఎ) మహిళ సీటు ఖాళీగా వున్నా మాకు ఇవ్వలేదు. మాకు నిజంగా ఆ సీటు ఇచ్చే అవకాశం లేదా? నేను 'తెనాలి హిందీ ప్రేమీమండలి'లో రు.10,700 ఫీజు కట్టాను. 25-3-04వ తేదీన తెనాలిలో జాయిన్ అయ్యాను. చాలా మంది టీచర్స్ నెల్లూరు సీటు నీకు గ్యారంటీగా ఇవ్వాలి మరి కౌన్సిలింగ్ పూర్తిగా అయిపోయిన తర్వాత ఖాళీగా వున్న సీటుని అర్హులైన అభ్యర్థి కోరుకున్నట్లయితే కచ్చితంగా ఇవ్వాలి అని అంటున్నారు. మాది పేద కుటుంబం. ప్రైవేటు కాలేజీల్లో ఫీజులు, మెస్ ఖర్చులు భరించాలంటే చాలా కష్టం. ఆ రోజు అధికారులు నాకు నెల్లూరు సీటు ఇస్తామని చెప్పి సాయంత్రం 6.30 గంటల వరకు మమ్మల్ని వెయిట్ చేయమని చెప్పి, నెల్లూరు సీటుకి నాన్‌లోకల్ అవుతారు ఇవ్వలేమని చెప్పారు. అసలు ఇది ఎంతవరకు నిజం. ఈ సమస్యపై నాకు సలహా ఇవ్వగలరు.

- సిహెచ్.పరిమళా దేవి, తెనాలి.

మీ విషయంలో నాన్‌లోకల్ సమస్య ఎదురైంది. మీరు చెప్పినట్లు నెల్లూరు కాలేజీలో రిజర్వుడు సీటు ఇంకను ఖాళీగానే వుంటే మీరు ఒక రిప్రజెంటేషన్ సంబంధిత అధికారులకు ఇచ్చి మీ అభ్యర్థిత్వాన్ని సానుభూతితో పరిశీలించి మీకు కేటాయించమని ప్రార్థించండి. అధికారుల నుండి ఎటువంటి స్పందన రానిచో మీకు గల అర్హతలను చూపుతూ, ఆ కాలేజీలో రిజర్వుడ్ సీటు ఇంకనూ భర్తీ చేయలేదని తెలుపుతూ ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌నందు మీ అభ్యర్థిత్వాన్ని కన్‌సిడర్ చేయుమని కోరుతూ అప్లికేషన్ ఫైల్ చేయుండి. ట్రిబ్యునల్ జోక్యంతో మీకు న్యాయం జరిగే అవకాశం కలదు.

కోర్టుకి తీసుకువెళితే ఛార్జీలు ఇవ్వరా?

మాది ఒక చిన్న గ్రామం. ఒక మర్డర్ కేసులో పంచనామా విట్‌నెస్ కింద సంతకం తీసుకున్నారు. సంతకం పెట్టేటప్పుడు పంచనామా విట్‌నెస్‌కు కేసు కోసం కోర్టుకు రావలసిన అవసరం లేదని పోలీసులు ఎంతో నమ్మకంగా చెప్పారు. ఈ స్టేషన్‌లో పంచనామా కరెక్టా, కాదా అని అడుగుతారు. మాకు ఇబ్బంది ఉండదని అన్నారు. ఇప్పుడు కేసు వాయిదాకు రావాలని సమన్స్ ఇచ్చి సంతకం తీసుకున్నారు. మీకు కోర్టుదాకా తీసుకు వెళ్ళేటప్పుడు ఛార్జీలు వారే పెట్టుకుంటారట. తిరిగి వచ్చేటప్పుడు మీ దారిన మీరు వెళ్ళండి అంటారట. నిజంగా అలా జరిగితే తిరుగు ఛార్జీలు పెట్టుకోకుండా మమ్మల్ని వదిలేస్తే మేము ఏమి చెయ్యాలి. డబ్బులు లేనప్పుడు మా పరిస్థితి ఏమిటి, మేము ఎవ్వరికి, ఎవ్వరి మీద, రిపోర్ట్ ఎలా చెయ్యాలి. వివరంగా న్యాయ సలహా ఇవ్వగలరు.

- జి.శ్రీనివాస్, చింతూరు.

మీరు పంచ్‌సాక్షిగా ఏ కోర్టుకైతే వెళ్తున్నారో అదే కోర్టునందు న్యాయమూర్తిగారే మీకు రాను పోను ఛార్జీలు, మీ యొక్క దినసరి ఖర్చులకుగాను కొంత మొత్తం ఇవ్వమని సంబంధితులకు ఉత్తర్వులు జారీ చేసి వుంటారు. కాని మీరు చెప్పిన ప్రకారం మిమ్మల్ని కోర్టు వరకే తీసుకెళతారని చెబుతున్నారు. తిరుగు ప్రయాణ ఖర్చులు, దినసరి ఖర్చులు ఇవ్వనట్లయితే న్యాయమూర్తిగారి దృష్టికి తీసుకు వెళ్ళండి. తగు న్యాయం జరుగుతుంది.

రుచి

దొండకాయ నిల్వ చట్నీ

తయారు చేసే విధానం:

దొండకాయలను శుభ్రంగా కడిగి తుడిచి ఉంచుకోవాలి. దొండకాయల్ని నాలుగు చీలికలుగా కోసుకోవాలి. వాటిలో పసుపు, కారం, ఉప్పు, మెంతిపిండి కలపాలి. వేడి నీళ్ళు కాగబెట్టి చింతపండులో పోయాలి. ఒక గంట నానబెట్టాలి. తరువాత మిక్సీ వేసి పిప్పి మొత్తం తీసివేయాలి. చింతపండు రసం కూడా ముక్కల్లో కలపాలి. దీనిని కదల్చకుండా మూడు రోజులు ఉంచాలి. మూడోరోజు నూనె కాగబెట్టి తాలింపు వేసి ఈ పచ్చడిలో పోయాలి. ఇష్టమైతే ఇంగువ కూడా తాలింపులో వేసుకోవచ్చు. వెల్లుల్లి రేకులు వలిచి చట్నీలో కలపాలి. ఇది ఆరు నెలలు పైన నిల్వ ఉంటుంది.

కావలసిన వస్తువులు:

దొండకాయలు: అరకిలో
ఉప్పు: ఒక గిద్ద
చింతపండు: 125 గ్రాములు
వెల్లుల్లి: 25 గ్రాములు
ఎండుమిరపకాయలు: 5
నూనె: పావుకిలో
కారం: ఒక గిద్ద
మెంతిపిండి: 50 గ్రాములు
ఆవాలు: ఒక స్పూను
జీలకర్ర: ఒక స్పూను
పసుపు: అర స్పూను
కరివేపాకు: రెండు రెబ్బలు

పంచదార పరోటాలు



తయారు చేసే విధానం:

గోధుమ పిండిలో కాస్త ఉప్పువేసి కలిపి చిన్న ఉండలుగా చేసుకోవాలి. ఆ ఉండల్ని రొట్టెలుగా వత్తి మధ్యలో పంచదార వేసి పైన ఇంకో రొట్టెను ఉంచి మళ్ళీ వత్తాలి. ఆ చపాతీలను పెనంమీద కాల్చాలి. చుట్టూ వెన్నగానీ, నెయ్యిగాని లేదా నూనెగాని వేసి మాడకుండా వాటిని కాల్చాలి. వాటిని పెనం మీద నుంచి తీసి వేడిగా ఉన్నప్పుడే తింటే చాలా రుచిగా ఉంటాయి.

కావలసిన వస్తువులు:

గోధుమ పిండి: 2 కప్పులు
పంచదార: నాలుగు టేబుల్ స్పూన్లు
నెయ్యి, నూనె లేదా వెన్న: తగినంత
ఉప్పు: తగినంత

కావలెను...

WANTED

For a reputed company in Vijayawada

MANAGER
RECEPTIONISTS
OFFICE ASSISTANTS

Experienced / Fresh Candidate with good academic background, fluency in English and knowledge of computer may apply to Post Box No.
Patamata, Vijayawada-520006.

సరళంగా ఇంగ్లీషు మాట్లాడటం తెలుసా మీకు?

ఉద్యోగ ప్రకటనలలోను, ఇంటర్వ్యూలలోను ఇలాంటి ప్రశ్న ఉండటం మీరు గమనించే ఉంటారు.

'Yes' అంటే ఆ ఉద్యోగం మీకే !

కావలసిన విద్యార్హతలు, అనుభవం ఉన్నప్పటికీ ఇంగ్లీషు మాట్లాడలేని ఒకే కారణంవల్ల మీకు వచ్చిన అవకాశాలు జారవిడవకండి.

మీ తీరిక వేళలో ప్రతిరోజు అరగంట సమయం కేటాయించి వివేకానంద ఇన్‌స్టిట్యూట్ అందించే సులభమైన శిక్షణ ద్వారా సరళంగా ఇంగ్లీషులో మాట్లాడటం నేర్చుకోండి.

ఇప్పటికి 16 లక్షలకు పైబడినవారు ఈ శిక్షణ మూలంగా ప్రయోజనం పొందారు.

మీరు కూడా ఈ ప్రయోజనం పొందటానికి క్రింద ఉన్న కూపన్ పూర్తిచేసి ఈ రోజే పంపించండి. శిక్షణకు కావలిసిన పాఠాలు **V.P.P.** ద్వారా మీ ఇంటిని వెతుక్కుంటూ వస్తాయి. పోస్ట్‌మేన్‌వద్ద **రూ. 575/-** చెల్లించి తీసుకోండి.

రోజూ అరగంట ప్రాక్టీసు చేయండి. తడబడకుండా ఇంగ్లీషులో మాట్లాడండి.

(044) 24347034
నెంబరుకు ఫోన్ చేస్తే చాలు
శిక్షణ పాఠాలు V.P.P. ద్వారా
ఇంటిని వెతుక్కుంటూ వస్తాయి.

ఇదిగో కూపన్

నేను ఇంగ్లీషులో సరళంగా మాట్లాడాలనుకుంటున్నాను. నాకు కోర్సు పాఠాలను **V.P.P.** ద్వారా పంపండి. పోస్టుమేన్‌కి **రూ. 575/-** చెల్లించి పాఠాలను తీసుకుంటాను.

KPS

పేరు: ....

వయసు: .... ఆడ ☐ మగ ☐

చిరునామా: ....

....

.... పిన్‌కోడ్..........

VIVEKANANDA INSTITUTE

9 (T), Madley Road, T. Nagar, Chennai-600017.

వివేకానంద ఇన్‌స్టిట్యూట్‌యొక్క ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: HYDERABAD: (S.R. NAGAR ☎ 23714330. DILSUKHNAGAR ☎ 24044352. KUKATPALLY ☎ 55341431. VANASTHALIPURA ☎ 24122464. MEHDIPATNAM ☎ 55755888. A.S. RAO NAGAR ☎ 55497992. NARAYANAGUDA ☎ 55155441). RAJAMUNDRY ☎ 2422003. KAKINADA ☎ 2386638. VISAKHAPATNAM ☎ 2738892. VIJAYAWADA ☎ 5530053. GUNTUR ☎ 2238541. NELLORE ☎ 2327702. THIRUPATI ☎ 2252878. CUDDAPAH ☎ 224445. KARIMNAGAR ☎ 2234883. WARANGAL ☎ 2578946. MIRYALGUDA ☎ 230130. ANANTAPUR ☎ 241029. KURNOOL ☎ 248099. NIZAMABAD ☎ 235767. PRODDATUR ☎ 250550.

08/TEL/04/NAGA